



# విజయభాను

విశాఖపట్నం, శనివారం 30-09-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 19 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# త్వరలో కురుక్షేత్ర యుద్ధం

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

- బతుకు బండి లాగడానికి ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసమే ఈ పథకం
- రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 75 వేల 931 మందికి రూ.275.93 కోట్ల ఆర్థిక సాయం జమ
- వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత నగదును విడుదల చేసిన సిఎం జగన్




విజయవాడ (విజయభాను న్యూస్) : వైఎస్సార్ వాహన మిత్ర ఐదో విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలోని విద్యాధరపురంలో విడుదల చేశారు. ఈరోజు ఉదయం తాడేపల్లి నివాసం నుండి విద్యాధరపురానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. విద్యాధరపురం స్టేడియంకు చేరుకున్న ముఖ్యమంత్రి.... అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై బటన్ నొక్కి వైఎస్సార్ వాహనమిత్ర నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. సొంత వాహనంతో స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా నగదు జమ అయ్యింది. ఆటోడ్రైవర్లు అందించిన ఖాకీ చొక్కాను ధరించిన సిఎం జగన్.. వేదికపై ప్రసంగించారు.

ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ బతుకు బండి లాగడానికి ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసమే ఈ పథకం అని అన్నారు. వాహనం

తరువాయి 2లో..

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర



న్యూఢిల్లీ : చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లు కేటాయించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ 106వ సవరణ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ నెల 28న బిల్లుపై సంతకం చేసినట్లు కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ (106 సవరణ) చట్టంగా రూపం దాల్చింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు (33 శాతం) సీట్లు రిజర్వుకానున్నాయి. కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొనబోయే లేదా ఆ తర్వాత నిర్ణయించే తేదీ నుంచి ఈ చట్టం అమల్లోకి రానుంది. అయితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధించిన నిబంధనల కారణంగా ఈ బిల్లు చట్టరూపం దాల్చినా మహిళా రిజర్వేషన్ ఎప్పటి నుంచి అమలవుతుందన్న సందిగ్ధత నెలకొనివుంది. నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమల్లోకి వస్తుందని కేంద్రప్రభుత్వం ఈ బిల్లులో పొందుపరచడమే సందిగ్ధతకు కారణం. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సివుంది. కోవిడ్ కారణంగా 2021 జనాభా లెక్కలు వాయిదా వేయడంతో ఈ విషయంలో ఇప్పటికీ గందరగోళం నెలకొన్న సంగతి విదితమే. 2024లో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత జనాభా గణన ప్రక్రియ మళ్లీ ప్రారంభమైనా, అది పూర్తి కావడానికి కనీసం రెండు మూడేళ్ల సమయం పడుతుంది.

నియోజకవర్గాల పునర్విభజన కూడా ఏళ్ల తరబడి జరిగే ప్రక్రియ. అందువల్ల మహిళా రిజర్వేషన్ చట్టం రూపం దాల్చినా అమలు కోసం 2029 ఎన్నికల వరకూ వేచిచూడాలి. 'నారీశక్తి వందన్ ఆదినియమ్' పేరిట రూపొందించిన ఈ బిల్లును ఇటీవల నిర్వహించిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఉభయ సభలూ ఆమోదించిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదని, అందుకే బిల్లులో అనేక ఆంక్షలు పెట్టారంటూ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్షాల సభ్యులు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మహిళా బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని, ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసి) రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిలో ఏ డిమాండ్‌కూ బిజెపి ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా రాలేదు.

# కృష్ణా జిల్లాలో 5రోజుల పాటు పవన్ వారాహి యాత్ర



అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నాలుగోదశ వారాహి విజయ యాత్ర కృష్ణా జిల్లాలో ఐదు రోజుల పాటు కొనసాగనుంది. ఈమేరకు జనసేన పార్టీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగిస్తారు. బహిరంగ సభ అనంతరం మచిలీపట్నం చేరుకుని 2, 3 తేదీల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 2న కృష్ణా జిల్లా జనసేన నేతలతో సమావేశమవుతారు. 3న జనవాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు. 4న పెడన, 5న కైకలూరు నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ పర్యటిస్తారు" అని ప్రకటనలో పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 30న 'మోత మోగిద్దాం'..

**వినూత్న నిరసనకు తెదేపా పిలుపు**



అమరావతి, (విజయభాను న్యూస్) : తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెదేపా సెప్టెంబర్ 30న వినూత్న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. చంద్రబాబుకు మద్దతుగా శనివారం రాత్రి 7గంటల నుంచి రాత్రి 7.05 గంటల వరకు ఐదు నిమిషాల పాటు ప్రజలంతా సీఎం జగన్‌కు వినిపించేలా ఏదో ఒక రకంగా మోత మోగించాలని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నారా బ్రాహ్మణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు 'ఎక్స్' (ట్విటర్)లో వేర్వేరుగా పోస్టులు

తరువాయి 2లో..

# "ఎక్ తారీక్ -ఎక్ గంట" శ్రమదానానికి సిద్ధమవుదాం



**– జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ**

విశాఖపట్నం : స్వచ్ఛ భారత్ అభియాన్ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జివిఎంసి చేపడుతున్న "ఎక్ తారీక్-ఎక్ గంట్" శ్రమదానానికి సిద్ధమవుదాం అని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా నగర పౌరులకు పిలుపునిచ్చారు. అక్టోబర్ ఒకటన

# డ్రోన్లతో భారత్‌లోకి మాదక ద్రవ్యాలు.. అడ్డుకున్న బీఎస్ఎఫ్

చండీగఢ్: భారత్– పాక్ సరిహద్దులో ఒకే రోజు రెండు డ్రోన్లు కలకలం సృష్టించాయి. పాక్ వైపు నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్ సెక్టార్‌లోకి ప్రవేశించిన ఓ డ్రోన్‌ను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ కూల్చివేసింది. ఆ డ్రోన్‌తో పాక్ వైపు నుంచి మాదక ద్రవ్యాలను భారత్ భూభాగంలోకి విడిచిపెట్టేందుకు ప్రయత్నించినట్లు భద్రతా బలగాలు తెలిపాయి. శుక్రవారం మధ్యాహ్నం పాకిస్థాన్ వైపు నుంచి ఓ డ్రోన్ భారత భూభాగంలోకి వస్తున్నట్లు గమనించిన బీఎస్ఎఫ్ సిబ్బంది.. వెంటనే అప్రమత్తమై దానిపై కాల్పులు జరిపారు. దీంతో ఆ డ్రోన్ నుంచి ఏదో వస్తువు కిందపడిపోయినట్లు గుర్తించారు. వెంటనే ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా.. ఓ బాటిల్‌లో హెరాయిన్‌గా భావిస్తున్న మాదక ద్రవ్యాలు లభ్యమైనట్లు తెలిపాయి.

అంతకముందు పంజాబ్ పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ సరిహద్దు కంచె

తరువాయి 2లో..




# జిల్లాలో 21,134 మంది వాహనదారులకు రూ.21.13 కోట్లు లబ్ధి




విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : వాహన మిత్ర పథకంలో సొంత వాహనం గల ఆటో, మినీ క్యాబ్ డ్రైవర్ లకు రూ.10 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని ముఖ్యమంత్రి వై.ఎస్..జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన విజయవాడ విద్యాధరపురం నుండి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 75 వేల 931 మందికి రూ.275.93 కోట్ల ఆర్థిక సాయం జమ చేయడం జరుగుతోందన్నారు. వాహనం డ్రైవర్లకు ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ఆటో/మినీ క్యాబ్ పూర్తి ఫిట్నెస్ తో ఉండడం మూలంగా అందులో ప్రయాణించే వారికి కూడా పూర్తి భరోసా లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్నిఅర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షించిన జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వాహన మిత్ర పథకం కింద 21,134 మంది లబ్ధిదారులకు రూ 21.13 కోట్లు ఆర్థిక సాయం అందించడం ద్వారా విశాఖ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ పథకం అమలులో గత నాలుగు దఫాలుగా కూడా జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని

వెల్లడించారు. వాహన మిత్ర పథకం క్రింద ప్రభుత్వం పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని అన్నారు. బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, మరమ్మతులు, ఇతర అవసరాలకు సంబంధించిన ఖర్చుల కోసం స్వీయ-యాజమాన్యమైన ఆటో/ టాక్సీ/మ్యాక్సీ క్యాబ్/ యండియు లకు ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. గాజువాకకు చెందిన లబ్ధిదారుడు ఆటో డ్రైవర్ శ్రీయల హరిరాము తన మనోభావాలను వ్యక్తపరిచారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఆటో డ్రైవర్ల కు ఆర్థిక సహాయం ఇచ్చి

తరువాయి 2లో..

## మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమం పై ర్యాలీ




భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ఈ దేశం కోసం, ఈ నేల, మట్టి కోసం ప్రాణాలర్పించిన దేశ నాయకులు, సైనికులు అమరవీరులను స్మరించుకుంటూ మేరీ మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించడం భారతీయులందరికీ స్ఫూర్తిదాయకమని డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఆయన ఆధ్వర్యంలో 'మేరీ మాటి మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నేల పై పుట్టిన ప్రతి ఒక్కరూ రక్తసంబంధీకులే అని, అందుచేత ఐకమత్యంతో దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు 'నా నేల నా దేశం' అంశంపై తయారుచేసిన వివిధ రకాల ప్రదర్శనలను ప్రదర్శిస్తూ భీమునిపట్నంలో ర్యాలీ నిర్వహించారు.

అంబేద్కర్ కూడలిలో సమావేశమై దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, దేశభక్తి నినాదాలు చేశారు. కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు సిఏ సోమయాజులు, జె. మాధవి, సరిపల్లి త్రినాధరావు, పి. హరిణి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులతో భారతీయ కాళా నృత్య ప్రదర్శన

భీమునిపట్నం విజయభాను న్యూస్ : చిల్లపేట గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక స్వామి విగ్రహం వద్ద పూజా కార్యక్రమాల సందర్భంగా 15 సంవత్సరాల లోపు చిన్నారులతో కళాకారులు తయారుచేసిన బి. దివ్య కుమారి కళాబృందం వారిచే భారతీయ కళా నృత్య ప్రదర్శన జరిగింది. చిన్నారులు వేసిన నృత్యం గ్రామస్తులును ఆకట్టుకుంది. చిన్నారులకు కూచిపూడి భరతనాట్యం ద్వారా తయారుచేసిన బి. దివ్య కుమారిని గ్రామ పెద్దలందరూ సమక్షంలో దుస్సాలువుతో సన్మానించారు. అదే విధంగా 40 మంది చిన్నారులకు మెమోంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమాలకు గ్రామంలో పెద్దలు, యువకులు సహాయ సహకారాలతో ఇంత దిగ్విజయంగా కార్యక్రమం జరిగిందని దీనికి సహకరించిన వారందరికీ పేరుపేరునా b శ్రీ సిద్ధి వినాయక స్వామి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్ల భాస్కర్ రెడ్డి, కొయ్య రాంబాబు,జె.వి కైలాష్ రెడ్డి, బి. కిరణ్ రెడ్డి,ఎస్. శివాంజనేయరెడ్డి, ఎం. ఆది నారాయణ, రాము, డి. శ్రీను, సి.హెచ్ సూరి బాబు దల్లి అప్పల రెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ ఆర్ ఐ మెడికల్ కాలేజ్ లో వైట్ కోట్ సెరిమనీ

భీమునిపట్నం విజయభాను న్యూస్ సంగివలస ఎన్ ఆర్ ఐ మెడికల్ కాలేజ్ లో 2023–24 బ్యాచ్ విద్యార్థులుకు వైట్ కోట్ సెరిమనీ,క్యాడవర్ సెరిమనీ డీన్ పి.వి సుధాకర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డా.జి.శాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైట్ కోట్ ధరించడం డాక్టర్ వృత్తి కి,వారి సేవాతత్పరితకు చిహ్నమని చెప్పారు.అనంతరం విద్యార్థులు తో చరక సంహిత ఓత్ ( మహర్షి చరక శపధే,ప్రమాణం చేయించారు.

ఈ ప్రమాణం ను తప్పకుండా పాటించాలని,నిజమైన సేవకుడుగా జీవితాంతం సేవ చేసే అదృష్టం కలగాలని అన్నారు. నేటినుండి డాక్టర్ గా విద్యనభ్యసించి తర్వాత డాక్టర్ గా సేవచేసి కాలేజీకి, తల్లితండ్రులకు గుర్తింపు తేవాలని కోరారు. అనంతరం క్యాడవర్ ఓత్ అనాటమీ డిసెక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీధర్ రెడ్డి,మెడికల్ సూపరింటెండెంట్ డా. సుజాత రత్నకుమారి,అద్యాపక సిబ్బంది,ఎ ఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

## మహా అన్నదానం



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ అవార్డు పరిధిలో స్వయంభుగా వెలిసిన శ్రీ శ్రీ దుర్గా అమ్మవారి ప్రతి శుక్రవారం జరిగే మాదిరిగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా ముఖ్య అతిథి పేదల పక్షపతి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ జీవీఎంసీ నగర మేయర్ గోలగాని హరివెంకట కుమారి శ్రీనివాస్ స్థానిక 35 వ వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు విచ్చేసివారి చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖంగా ఆరోగ్యంగా సౌఖ్యంగా ఉండాలని ప్రార్థించి తదనంతరం మహా అన్నదానానికి ధన సహాయం చేసిన దాత దుర్గాలమ్మ డ్రిల్లింగ్స్ వాస్తవ్యులు శ్రీశ్రీ పెదబాబు ఆర్థిక సహాయంతో అమ్మవారికి నివేదించిన మహా అన్నప్రసాదాన్ని సుమారు 200 మందికి స్వయంగా జీవీఎంసీ నగర మేయర్ గోలగాని హరి వెంకట కుమారి శ్రీనివాస్ 35 వ వార్డ్ వైసీపీ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు 30 వ వార్డ్ వైసీపీ కార్పొరేటర్ కొండమ్మ గారు ఈఓ శేఖర్ బాబు వారి చేతుల మీదుగా వడ్డించడం జరిగినది కార్యక్రమంలో శ్రీ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ నాయన మల్లి బాబు ధర్మకర్తలు భక్తి మంగరాజు కంటిపిల్లి వరలక్ష్మి కాండ్రేగుల రూపవతి యాల రవణమ్మ సారిపల్లి వెంకటలక్ష్మి ధవళ సత్యనారాయణ దశమంతల వేణుగోపాల్ గారు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు



శ్రీ వర సిద్ది వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో పలు వినాయక చవితి మండపాలను సందర్శించి, ముందుగా స్వామి వారికి పూజులు నిర్వహించి తదనంతరము అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మన్యాల శ్రీనివాస్ 29వ వార్డు అంతోని నగర్ శ్రీ వర చింతామణి గణపతి ఆలయం ధర్మకర్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీ స్వామి వారి కళ్యాణం సందర్భంగా పసుపు దంచు కార్యక్రమం లో పాల్గొన్నారు.. 29వ వార్డు రామజోగి పేట P. గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన, విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకొని , ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. 30వ వార్డు అంగటిదిబ్బ యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు & యూత్ బాయ్స్ పాల్గొన్నారు.

## 4వ జోన్ లో బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 4వ జోన్ కు సంబంధించిన దిగువ తెలుపబడిన దుకాణాలకు, కళ్యాణ మండపాలకు, క్యాంటీన్ కు తేదీ. 12.10.2023న ఉదయం 11.00 గంటలకు 4వ జోన్ కార్యాలయంలో బహిరంగ వేలం జరుపబడునని జోనల్ కమిషనర్ శివప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. వార్డు నెంబర్– 35లో స్ప్రింగ్ రోడ్డు వద్ద ఉన్న డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం కింద అంతస్తులో 9, 10, 11, 12, 13 (జనరల్), 15 (ఎస్.సి.), మొదటి అంతస్తులో 1(ఎస్.సి), 2(ఎస్.సి), 3 నుండి 7వరకు, 9 నుండి 14, 15(జనరల్), వార్డు నెంబర్–31లో జగదాంబ వాణిజ్య సముదాయం నందు 3, 5, 14, 13(ఎస్.టి), వార్డు నెంబర్–35లో ఓల్డ్ బస్టాండ్ పేజ్–2 దుకాణం నెంబర్లు 1 నుండి 6, 8, 10, 11,13, 14, 15(జనరల్), 7(ఎస్.సి), 9(ఎస్.టి), 12(ఎస్.సి), వార్డు నెంబర్–39లో లక్ష్మీ టాకీస్ దగ్గర పద్మ నగర్ వాణిజ్య సముదాయములో 1, 3, 6, 7, 11, 12(జనరల్), 8(ఎస్.సి), 31వ వార్డులో జోన్–4 జివిఎంసి ఆఫీసు వద్ద సూర్యాభాగ్ వాణిజ్య సముదాయం నందు 8 (గ్రౌండ్ ఫ్లోర్), మొదటి అంతస్తు దుకాణం%--%9, వార్డు నెంబర్–37 లోని రెల్లి వీధి వాణిజ్య సముదాయంలోని దుకాణం నెంబర్ 1, 2, 4, జడ్జీ కోర్ట్ ఎదురుగా ఉన్న వాణిజ్య సముదాయంలోని దుకాణం నెంబర్–8 (జనరల్), 37వ వార్డులో అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లి వీధి షిప్ మార్కెట్ (రోడ్ సైడ్) లకు బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వ్యక్తులు సంస్థలు పైన తెలుపబడిన తేదీలలో 4వ జోనల్ కార్యాలయంలో జరుగు వేలంపాటలో పాల్గొన వలసినదిగా జోనల్ కమిషనర్ తెలియజేశారు. పూర్తి వివరాలు కొరకు 4వ జోన్ కార్యాలయపు పనివేళలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు పర్యవేక్షణ అధికారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది.

## జిల్లాలో 21,134 మంది వాహనదారులకు రూ.21.13 కోట్లు లబ్ది

మమ్మల్ని ఆదుకున్నారని, అంతేకాకుండా తనకు ఇంటి పట్టా ఇచ్చారని, అమ్మఒడి పథకం కింద రూ.15వేలు అందజేశారని తనలాంటి వారికి ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్న ముఖ్యమంత్రి మా అందరికీ ప్రత్యక్ష దైవం అని కొనియాడారు. మల్కాపురానికి చెందిన లబ్దిదారుడు ఆటో డ్రైవర్ కె.రాంబాబు మాట్లాడుతూ తనకు వరుసగా 5వ ఏడాది వాహన మిత్ర పథకం క్రింద 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందడం చాలా ఆనందంగా ఉందన్నారు. అతని బార్య వాలంటీరుగా పని చేస్తుందన్నారు. అమ్మఒడి ద్వారా కూడా తమ కుటుంబానికి 15 వేల రూపాయలు లబ్ది చేకూరిందన్నారు. పేదల సంక్షేమం కోసం సమాజంలో వెనుకబడిన వారికి ఎవరూ ఊహించని విధంగా వివిధ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టరు ప్రజాప్రతినిధులతో కలిసి వాహన మిత్ర లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.

ఈ కార్యక్రమంలో పెట్రో కెమికల్ అథారిటీ చైర్ పర్సన్ చొక్కాకుల లక్ష్మీ, నగరాల కార్పొరేషన్ చైర్ పర్సన్ పిల్లా సుజాత, యాత కార్పొరేషన్ చైర్ పర్సన్ పిల్లా సుజాత, జాయింట్ రవాణా కమీషనరు వడ్డీ సుందర్, ఉప రవాణా కమిషనరు జి.సి. రాజరత్నం, రవాణా శాఖ అధికారులు, లబ్దిదారులైన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్య సురక్ష ను వినియోగించుకోవాలి

### వార్డ్ కార్పొరేటర్ ఉరికీటీ నారాయణ రావు

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖ దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు పరిధిలో వెంకటపతి రాజు నగర్ ఏరియాలో జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశ వాలంటీర్స్ గడప గడపకు వెళ్లి ప్రజల చెంతకే వైద్యం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక వార్డ్ కార్పొరేటర్ ఉరికీటీ నారాయణ రావు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నారాయణ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సురక్ష ను వినియోగించుకోవాలని ,ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి పరీక్షలు చేసి ,వైద్యం అందించే ప్రక్రియ ఇప్పటివరకు ఎవ్వరూ చేయలేదని ఇది సరికొత్త అధ్యాయం అని తెలియజేస్తూ అభివృద్ధి అనేది ఇలానే ఉంటుంది అని చెప్పడం జరిగినది. ఇలాంటి ముఖ్యమంత్రి మన దేశంలో ఎవరూ ఎక్కడ లేరని, మనందరం కలిసి మరొకసారి జగనన్నను మరల ముఖ్యమంత్రి చేసుకోవాలని చెప్పడం జరిగింది.మీకు ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా వైద్యం అందించడమే లక్ష్యంగా, ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే ప్రభుత్వంగా, ప్రజల చెంతకే ప్రభుత్వ ఆరోగ్య యంత్రాంగం మరో రెండు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్ల ల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ల వరకు మీ కుటుంబానికి వైద్యం అందించడానికి మీ ఊర్లోనే క్యాంపులను నిర్వహించనున్నారు అని స్థానిక 29 వార్డ్ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ వైస్ ప్రెసిడెంట్ ఉరికీటీ నారాయణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్, హెల్త్ సూపర్వైజర్, వాలంటీర్లు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




నిన్న ఉదయం నుండి జిల్లా పార్టీ కార్యాలయంలో 48 గంటల దీక్ష చేస్తున్న టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, అనుబంధ సంఘ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఉరుకుటి డేవిడ్, మొల్లేటి కుమార స్వామి, కోట నరేష్, షేక్ రహమతుల్లా, పాసర్ల తరుణ్ ఆదిత్య, ప్రీతం, ప్రవీణ్ లకు సంఘీభవం తెలియజేసిన తెలుగుదేశం రాష్ట్ర బీసీ కమిటీకార్యదర్శ బొట్టపదేసి యాదవ్ . ఈ సందర్భంగా మాట్లాడుతూ ... కుట్రతో అన్యాయంగా అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యములా బయటకు వస్తారని ఆత్మవిశ్వాసంతో తెలుగుదేశం కుటుంబ సభ్యులుఎదురుచూస్తున్నామనితెలియజేశారు

# త్వరలో కురుక్షేత్ర యుద్ధం

ఇన్స్యూరెన్స్, ఇతర ఖర్చుల కోసమే వైఎస్సార్ వాహన మిత్ర అందజేస్తున్నామన్నారు. ఆటో,ట్యాక్సీ డ్రైవర్లకు అండగా నిలిచేందుకే ఈ పథకం ప్రవేశపెట్టామని తెలిపారు. ఈరోజు రూ.276 కోట్ల రూపాయలు జమ చేస్తున్నామని సిఎం ప్రకటించారు. వైఎస్సార్ వాహన మిత్రతో ఒక్కొక్కరికీ రూ.50 వేలు లబ్ది చేకూరుతుందన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలు చేస్తున్నందుకు గర్వపడుతున్నానని ముఖ్యమంత్రి అన్నారు. " ఇది జగనన్న ప్రభుత్వం కాదు.. ఇది మీ అందరి ప్రభుత్వం " అని సిఎం జగన్ అన్నారు.

గత పాలకులకు మనసు లేదు... : సిఎం జగన్

వాహనాలకు ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఉంచుకోవాలని సిఎం జగన్ సూచించారు. ఎంతోమంది ప్రయాణికులకు డ్రైవర్లు సేవలందిస్తున్నారని ప్రశంసించారు. జగనన్న సురక్ష ద్వారా అవసరమైన సర్టిఫికేట్లు ఇంటికే అందిస్తున్నామని అన్నారు. పథకాలన్నీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. అవినీతికి తావులేకుండా పథకాలను అందిస్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ చేశామన్నారు. అర్‌బీకేలతో రైతులకు అండగా నిలిచామని సిఎం తెలిపారు. పాదయాత్రలో ఆటో డ్రైవర్ల కష్టాలు చూశానన్నారు. వారి సమస్యలకు పరిష్కారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రైతన్నకు రూ.30,985 కోట్లు వైఎస్సార్ రైతు భరోసా సాయంగా అందుతుందని, మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచామని అన్నారు. వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్ అంటే పేదల గొంతుకై నిలబడిన ప్రభుత్వం అని సిఎం వివరించారు. చిరు వ్యాపారులకు రూ.2,956 కోట్లు సాయం అందించామని ముఖ్యమంత్రి తెలిపారు. వైఎస్సార్ కాపునేస్తంతో రూ.2,029 కోట్లు సాయం అందించామన్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తంతో రూ.1257 సాయం అందించామని చెప్పారు. గత పాలకులకు మనసు లేదనీ.. నిరుపేదల వైపు నిలబడిన ప్రభుత్వానికీ.. నిరుపేదలను వంచించిన గత ప్రభుత్వానికీ మధ్య యుద్ధం జరుగుతుందని సిఎం అన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతీ హామీని అమలు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన ప్రభుత్వం గత ప్రభుత్వం అని విమర్శించారు.

త్వరలో కురుక్షేత్ర యుద్ధం : సిఎం జగన్

త్వరలో కురుక్షేత్ర యుద్ధం జరగబోతోందని సిఎం జగన్ ప్రకటించారు. లంచం, వివక్ష లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్, స్కిల్ స్కామ్, అసైన్డ్ భూముల స్కామ్, అమరావతి పేరుతో స్కాములు చేసిన గత ప్రభుత్వంతో యుద్ధం జరుగుతోందన్నారు. గతంలోనూ ఇదే బడ్జెట్, మారిందల్లా సిఎం ఒక్కడేనని చెప్పారు. గతంలో ఎందుకు ఈ పథకాలు ఇవ్వలేకపోయారు ? అని ప్రశ్నించారు. " దోచుకోవడానికి వాళ్లకు అధికారం కావాలి.. దోచుకున్నది పంచుకునేందుకే వాళ్లకు అధికారం కావాలి.. వాళ్లకు మాదిగా నాకు గజ దొంగల ముఠా తోడుగా లేదు.. దోచుకుని పంచుకుని తినుకోవడం నా విధానం కాదు.." అని సిఎం జగన్ అన్నారు.

## డ్రోన్లతో భారత్‌లోకి మాదక ద్రవ్యాలు.. అడ్డుకున్న బీఎస్ఎఫ్

వెంబడి ఉన్న పొలాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో కూలిన డ్రోన్‌తోపాటు కూల్‌డ్రింక్ బాటిల్‌లో మాదక ద్రవ్యాలు లభ్యమైనట్లు బీఎస్ఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ రెండు ఘటనల్లో కిలో హెరాయిన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. డ్రోన్లు చైనాలో తయారైనవిగా గుర్తించారు. సరిహద్దు వెంబడి మాదక ద్రవ్యాల సరఫరాను ఎప్పటికప్పుడు కట్టడి చేస్తున్నామని బీఎస్ఎఫ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో డ్రోన్‌ల ద్వారా జరిగే ఆయుధ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు డ్రోన్ సాంకేతికత, యాంటీ–డ్రోన్ నిపుణులను సరిహద్దుల వెంబడి నియమించనున్నట్లు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా గతంలో తెలిపారు.

# సెప్టెంబర్ 30న 'మోత మోగిద్దాం'..

పెట్టారు. నియంత ముందు మొరపెట్టుకుంటే ఫలితం ఉండదని.. అధికార మత్తు వదిలేలా మోత మోగించాల్సిందేనంటూ ప్రత్యేక పోస్టర్‌ను పోస్ట్ చేశారు. ఐదు కోట్ల ఆంధ్రులంతా ఒక్కటిగా ఇంట్లోనో, ఆఫీస్‌లోనో ఇంకెక్కడ ఉన్నా సరే బయటకు వచ్చి గంట లేదా ప్లేట్ మీద గరిటెతో కొట్టాలని, రోడ్డుపై వాహనంతో ఉంటే పక్కకు ఆపి హారన్ మోగించాలని కోరారు. ఎవరు ఏ రూపంలో నిరసన తెలిపినా సంబంధిత వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "అక్రమ అరెస్టు చేస్తే ప్రజాగ్రహం ఎలా ఉంటుందో చూపిద్దాం. తప్పుడు కేసులు బనాయిస్తే వెనక్కి తగ్గమని నిరూపిద్దాం. నిలువెత్తు నిజాయితీ రూపం, తెలుగు తేజం చంద్రబాబుకు మద్దతుగా తెలుగు వారంతా ఉన్నారని నిరూపించే తరుణమిది. నిష్కళంక రాజకీయ మేరునగధీరుడు చంద్రబాబు నాయుడుకు మద్దతుగా 30వ తేదీ శనివారం రాత్రి 7 గంటల నుంచి 7.05 నిమిషాలకు ఉన్న చోటే మోత మోగించి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాశబ్దం వినిపిద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

మీ నిశ్శబ్దాన్ని బ్రేక్ చేయండి: భువనేశ్వరి

మరోవైపు ఇదే అంశంపై చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సైతం ట్వీట్ చేశారు. "చంద్రబాబు గారి మీద తప్పుడు కేసు పెట్టి, ఆయన అవినీతి చేశారని చెప్తే ప్రజలు నమ్మేస్తారని అనుకుంటున్నారు. మీ నిశ్శబ్దం వారి నమ్మకాన్ని నిజం చేస్తుంది. అందుకే ఆ నిశ్శబ్దాన్ని బ్రేక్ చేయండి. శబ్దం చేయండి. చంద్రబాబు పట్ల మీరు చేసింది తప్పు అని వాళ్ళకి చెప్పండి. చంద్రబాబుకు మద్దతుగా శనివారం రాత్రి 7 నుండి 7.05 గంటల వరకు 5 నిమిషాల పాటు వీధుల్లోకి వచ్చి గంటలు మోగించండి. లేదా ఒక పళ్లెం తీసుకుని గరిటెతో కొట్టండి. విజిల్ వేయండి. రోడ్డు ప్రయాణంలో ఉన్నా పరవాలేదు. వాహనం పక్కకు తీసుకుని హారన్ కొట్టండి. మొత్తమ్మీద ఏదో ఒక శబ్దం చేయండి." అని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు మౌనంగా ఉంటే అన్యాయం చెలరేగిపోతుంది: బ్రాహ్మణి

"పాలకుల అక్రమాలకు అడ్డు చెప్పకపోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ముఖ్యంగా ప్రజలు మౌనంగా ఉంటే అన్యాయం చెలరేగిపోతుంది. అందుకే ఏపీ ప్రజలకు నా విజ్ఞప్తి! చంద్రబాబు గారి గురించి మీకు బాగా తెలుసు. ఆయన్ను అక్రమంగా నిర్బంధించడం తప్పు అని చెప్పండి. చంద్రబాబుకు మద్దతుగా సెప్టెంబర్ 30, రాత్రి 7 నుండి 7.05 గంటల వరకు 5 నిమిషాల పాటు వీధుల్లోకి వచ్చి గంటలు మోగించండి. లేదా ఒక పళ్లెం తీసుకుని గరిటెతో కొట్టండి. విజిల్ వేయండి. రోడ్డు ప్రయాణంలో ఉంటే హారన్ కొట్టండి. మొత్తమ్మీద ఏదో ఒక శబ్దం చేసి ప్రభుత్వానికి మీ నిరసన తెలియజేయండి" అని తెలుగు ప్రజలకు బ్రాహ్మణి విజ్ఞప్తి చేశారు.

## "ఎక్ తారీక్ –ఎక్ గంట" శ్రమదానానికి సిద్ధమవుదాం

"ఎక్ తారీక్ –ఎక్ గంట" పరిశుభ్రత కార్యక్రమం ఋషికొండ, ఆర్కే బీచ్ ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛత హీ సేవే లక్ష్యంగా బాపూజీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛత కార్యక్రమం అక్టోబర్ 1వ తేదీన ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఋషికొండ, ఆర్కే బీచ్ లలో స్వచ్ఛత హీ సేవే కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మేయర్, డిప్యూటీ మేయర్ లు, ఫోర్ లీడర్లు, కార్పొరేటర్లు, జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, పోలీస్ అధికారులు పాల్గొంటున్నందున ఈ కార్యక్రమానికి పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఎన్జీవోస్, నివాస సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. ఈ పరిశుభ్రత సేవకు నగర పౌరులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే విశాఖ నగరంలో అన్ని వార్డులలో గల బహిరంగ ప్రదేశాలు, పార్కులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పాఠశాల – కళాశాల, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, దేవాలయాలలో విశాఖ నగర పరిశుభ్రత కోసం ఒక గంట సేపు మనందరం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొందామని తెలిపారు. విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఎకో–వైజాగ్ అభివృద్ధికి సహకరిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మూలకణ పరిశోధనలపై గీతం జాతీయ సదస్సు



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** మూలకణ పరిశోధనలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సదస్సును నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. బయోటెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులపై విద్యార్థులు పరిశోధకులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, బయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ షేక్ ఖాశీంబీబీ, సదస్సు కో–కన్వీనర్ ఆర్.గోపీనాధ్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎమ్‌బి) శాస్త్రవేత్త డాక్టర్ బి.కిరణ్‌కుమార్ గౌరవ అతిథిగా హాజరై కంటిలో కార్నియా చికిత్సలో మూలకణాల ప్రాధాన్యతను తెలిపారు. గీతం బయోకెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మళ్ళ రామారావు రొమ్ముకేన్సర్ మూల కణాలపై ప్రసంగించారు. అమెరికాలోని టెక్సాస్‌లో గల ఎ అండ్ ఎమ్ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరక్టర్ ప్రొఫెసర్ ప్రేమ్‌కుమార్ బి.సగంటి అంతరిక్షంలోకి వెళ్ళే వ్యోమగాములలో శారీరక మార్పులు, రేడియేషన్ ప్రభావం పై తమ పరిశోధనలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పదవీ విరమణ పొందిన బయోటెక్నాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మావతి దొరోతిని ఘనంగా సన్మానించారు.

# విశాఖ జోన్లో 53% రక్త హీనత తో మహిళలు

- అదిగమించే దిశగా నర్సీపట్నం లో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవం
- సుపోషణ బారత్, సాక్షర బారత్, స్వశక్తి బారత్ పై జోనల్ సదస్సు



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం : జోనల్ స్థాయి ఆరవ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి అధ్యక్షత వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటికీ కూడా కొన్ని అలవాట్లు, ఆచారాలు, దురాగతాలు, మనసులో అనుకున్నది నిర్భయంగా చెప్పలేని దుస్థితిలో నుండి యువతులు బయట పడాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. సిడిపిఓ మేరీ సువార్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ ను పరిశీలించి వంటకాల గూర్చి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, కేర్ ఇండియా నుంచి సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగిస్తూ.... విశాఖ జోన్లో ప్రస్తుతం 53% మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని విచారం చేశారు. విశాఖపట్నం జోన్ ఏసీడీపిఓ కే యల్ ఆర్ కే కుమారి, ప్రాజెక్ట్ సీడీపీఓ లు సంతోషి,ఉమా, సుజాత, రమణి,ఆర్ ఐ వెంకట లక్ష్మీ, స్థానిక ఐసిడిఎస్ సిబ్బంది, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.అనంతరం చిల్డ్రన్ హోం వద్ద పరిశరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.



## 5లో పలు చోట్ల ఘనంగా మహా అన్నదానం



మధురవాడ (విజయభాను న్యూస్) :మహా విశాఖ 5వ వార్డ్ పరిధిలో గణేష్ నగర్ శ్రీ విజయ గణపతి దేవాలయం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గణనాధుని నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రంది నాయుడు దంపతుల ఆర్థిక సహాయంతో సుమారు 6000 మందికి ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు హాజరై ప్రారంభించారు అనంతరం బొట్టవానిపాలెం గ్రామంలో పాల్గొని గ్రామయువత, పెద్దల ఆధ్వర్యంలో సుమారు 5000మందికి భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. గణనాధుని దీవెలను అందరి పైనా ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నమ్మి శ్రీను, ఈగల రవికుమార్, నమ్మి సూర్య అప్పారావు, వియ్యపు నాయుడు, కొర్రాయి సురేష్ ,గ ణేష్ నగర్ విజయ గణపతి ఆలయ సమన్వయ కమిటీ సభ్యులు చలుమూరి శ్రీనివాసరావు,రంధి నాయుడు,వెంకటేశ్వరరావు, టెక్కలి మోహన్,బొట్టసురేష్, గణపతి ,పితాని వాసు,తాండ్ర సన్యాసిరావు,సంభాని సుజీవరవు,టెక్కలి అరుణమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ బాల్స్ వేయడానికి అనుకూల ప్రాంతాలు చూపండి

జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ




విశాఖపట్నం సెప్టెంబర్ 29:- సీడ్ బాల్స్ వేసేందుకు అనుకూలమైన కొండ ప్రాంతాలను ఎంపిక చేయాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ నెవల్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన ఐ.ఎన్.ఎస్. డేగాలో నేవల్ అధికారులైనా కమాండో దీపక్ సింగ్, కెప్టెన్ రాజ్ కుమార్ సద్దార్ లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు నేవల్ అధికారుల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలోని పలు కొండలపై సీడ్ బాల్స్ ను హెలికాప్టర్ ద్వారా జార విడిచేందుకు నేవల్ అధికారుల సహకారం తీసుకున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి పురస్కరించుకొని నగర పరిధిలో 7 కొండలపై వాటిని జార విడిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఒకటవ జోన్ మూడు నాలుగు వార్డుల పరిధిలోని భీమిలి పావురాల కొండ ప్రాంతంలో రెండు చోట్ల, కాపులుప్పాడ కొండ, 3 , 5 జోన్లలోని 9, 12, 14, 45 వార్డుల పరిధిలో సింహాచలం కొండ, 8వ జోన్ 92, 94 95 వార్డుల పరిధిలో మేఘాద్రి వద్ద ఉన్న పోర్లుపాలెం కొండ, ఆరవ జోన్ 88, 64వ వార్డుల పరిధిలోని వెదుర్ల నరవ కొండ, యారాడ కొండలపై విత్తనాలు జారవిడిచేందుకు నేవల్ అధికారులతో చర్చించామన్నారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్ర ధర్మం పాటించిన పవన్ కు రుణపడి ఉంటాం

- టిడిపి జనసేన ప్రయాణం కలకాలం కొనసాగాలి
- బొగ్గు శ్రీను మొదటి నుంచి నాకు మంచి ఆప్తుడు
- ఆర్థిక నేరగాడు సీఎం కావడం దురదృష్టకరం
- రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం కుంటుపడింది
- రాజకీయ కక్షతోనే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు
- జగన్ విశాఖ వస్తే పులివెందుల రాజకీయాలు పునారావతం అవుతాయి
- రానున్న ఎన్నికల్లో వైకాపాకు గుణపాఠం చెప్పాలి

- మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





కంచరపాలెం (విజయభాను న్యూస్): కష్ట కాలంలో మిత్ర ధర్మం పాటించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు రుణపడి ఉంటామని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారంటూ గ్రేటర్ విశాఖ 49వ వార్డులో వార్డ్ టిడిపి ప్రధాన కార్యదర్శి సంగు వాసు ఆధ్వర్యంలో శుక్రవారం అక్రమ అరెస్టుకు మద్దతుగా నిరసన తెలియజేస్తూ, స్థానిక శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాస్ ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గంటా మీడియాతో మాట్లాడుతూ ఆపదలో ఆదుకునే వారే నిజమైన స్నేహితులన్నారు. టిడిపి జనసేన ప్రయాణం కలకాలం కొనసాగాలని ఆశభావం వ్యక్తం చేశారు. టిడిపి జనసేన కలయిక రానున్న రోజుల్లో రాష్ట్రానికి శుభసూచకమని తెలియజేశారు.


జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గు శ్రీను నాకు మొదటి నుంచి మంచి ఆప్తుడని గతంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో కలిసి చురుగ్గా పనిచేశారని అన్నారు. ఏ కార్యక్రమం చేసిన నన్ను అభిమానంతో పిలిచి భాగస్వామ్యం చేసి ఘనంగా సత్కరించి తన కృతజ్ఞతలు తీర్చుకుంటాడని అన్నారు.

ఆర్థిక నేరాల్లో అరెస్టై 16 నెలలు జైల్లో ఉండి బెయిల్ పై వచ్చిన వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని రాష్ట్ర భవిష్యత్తును విస్మరించి స్వార్థ ప్రయోజనాల కోసమే రాజకీయాలు చేస్తున్నారని గంటా మండిపడ్డారు. ఇచ్చిన హామీలలో 98 శాతం హామీలు నెరవేర్చడంలో వైకాపా ప్రభుత్వం విఫలం చెందారాని అన్నారు. వైకాపా అధికారంలోకి వస్తే ఢిల్లీ పెద్దలు మెడలు వంచి ప్రత్యేక



హోదా తెస్తాం అన్న వైకాపా పెద్దలు 23 మంది ఎంపీలు ఢిల్లీకి వెళ్లి మెడలు వ ఉంచకుండా కాళ్లు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో వైకాపాకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నిప్పుతో తలగోకున్నా చందంగా జగన్ వ్యవహారం ఉందని అన్నారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలలో రాష్టనికి ఒక్క పరిశ్రమ రాలేదని అన్నారు. ఎన్నికల రానున్న తరుణంలో భోగాపురం ఎయిర్పోర్ట్, మెట్రో రైలు అంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దసరా నుండి విశాఖపట్నం రాజధాని అంటున్న తరుణంలో విశాఖకు శుభవార్త కాదు.. దురవార్త అన్నారు.విశాఖలో అధికార పార్టీ ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ వ్యవహారంతో నగరంలో శాంతిభద్ర తలను ఎలా నీరు కారుస్తున్నారో అర్ధమవుతుందన్నారు. సీఎం జగన్ విశాఖపట్నం వస్తే పులివెందుల రాజకీయాలు పునరావతం అవుతాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని, ఏపీలో స్కూల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటులో నేను భాగస్వామిని అప్పటికి నేను విద్యాశాఖ మంత్రి గా వున్నానన్నారు. స్కిల్ డెవలప్మెంట్లో సుమారు రెండు లక్షల మంది ట్రైనింగ్ పొందుతే 70 వేల మందికి ఉద్యోగాలు దేశవ్యాప్తంగా వచ్చాయి, అందుకే దేశవ్యాప్తంగా ఐటి ఉద్యోగాలు నిరసనలు తెలుపుతు న్నారన్నారు.

ఇప్పటికైనా సీఎం జగన్ తన తప్పును తెలుసుకొని రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబుపై పెట్టిన తప్పుడు కేసులను వెనక్కు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, టిడిపి ఉత్తర నియోజకవర్గం ఇన్చార్జ్ విజయబాబు, జనసేన రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, ఉత్తర ఇంచార్జి పసుపులేటి ఉషా కిరణ్, వార్డు అధ్యక్షులు కార్తీక్ కుట్టా, సనపల వరప్రసాద్, ఈతలపాక సుజాత, సనపల కీర్తి, జాన్ , బొడ్డేటి మోహన్, ముక్కా కిషోర్, కోయిలాడ వెంకటేష్, గొంప ధర్మారావు, బొడ్డేపల్లి లలిత, ఐ టీడీపీ దినేష్ మరియు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బర్మా క్యాంపు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్. జై భారత్ నగర్ గ్రామం తరపున ఆ గ్రామ అధ్యక్షుడు బొగ్గు శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం మాజీ మంత్రి గంటాకు అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# విజయభాను సంపాదకీయం

## ఏకపక్షం

ప్రజా సమస్యలకు పట్టం కట్టి, వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేయాల్సిన అసెంబ్లీ సమావేశాలు ఏకపక్ష విన్యాసాలుగా మారడం దురదృష్టకరం. ఐదు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి శూన్యం. ఫలప్రదంగా చర్చలు జరిగాయని ప్రభుత్వం చెప్పుకోవడం సముచితమనిపించుకోదు. మొదటి రెండు రోజులు అసెంబ్లీకి హాజరైన ప్రధాన ప్రతిపక్షం, ఆ తరువాత సమావేశాలను బహిష్కరించింది. మండలిలో పిడిఎఫ్ సభ్యులు లేవనెత్తిన వివిధ అంశాలకు అధికారపక్షం నుండి దాటవేతే సమాధానంగా వచ్చింది. ఇక ప్రతిపక్షమే లేకుండా జరిగిన శాసనసభలో చర్చలు ఏ రీతిగా జరిగి ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అత్యంత కీలకమైన జిపిఎస్ బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరే దీనికి నిలువెత్తు నిదర్శనం. ఈ బిల్లును శాసనసభలో ఏకపక్షంగా ఆమోదించుకున్న ప్రభుత్వం మండలిలో పిడిఎఫ్ సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోలేదు. నిరసన చెబుతుండగానే బిల్లును ఓటింగ్‌కు పెట్టి, మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఓటింగ్‌కు పెట్టే సమయంలో సభ్యులందరూ తమ సీట్లలో ఉండేలా చూసుకోవాలన్న ప్రాథమిక సూత్రాన్ని కూడా పాటించలేదు. దీంతో పిడిఎఫ్ సభ్యులకు వాకౌట్ చేయడం మినహా మరో మార్గం కనిపించలేదు. నిజానికి ఈ బిల్లుకు వ్యతిరేకంగా, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) కావాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అయినా, చట్టసభల్లో విస్తృతమైన చర్చకు ప్రభుత్వం సిద్ధపడకపోవడం దారుణం.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ స్కామ్‌లో అవినీతి ఆరోపణలపై మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన నేపథ్యంలో జరిగిన తాజా అసెంబ్లీ సమావేశాలకు సహజంగానే ప్రాధాన్యత ఉంది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యులు ఏం ప్రశ్నిస్తారు? అధికారపక్షం ఏం జవాబు చెబుతుందన్న ఉత్కంఠ రాష్ట్ర వ్యాప్తంగానే ఉంది. దీంతో పాటు ఎన్నికల వేడి ఇప్పటికే రాజుకోవడంతో వివిధ ప్రజాసమస్యలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్న అంశం కూడా ఆసక్తికరంగా మారింది. అయితే, జరిగింది భిన్నం. మొదటి రెండు రోజులు అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలకే సరిపోగా, ఆ తరువాత ఏకపక్షానికే సభ పరిమితమైంది. తప్పనిసరి పరిస్థితుల్లో, చిట్టచివరి ప్రయత్నంగా మాత్రమే ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాల్సి ఉండగా, జరిగింది దానికి భిన్నం. సాంకేతికంగా సభలో చేసిన ఒకటి, రెండు విజ్ఞప్తులు మినహా ప్రతిష్టంభనను తొలగించడానికి అవసరమైన చొరవను అధికారపక్షం చూపలేదు. ఈ సందర్భంగా స్పీకర్ అనుసరించిన వైఖరి కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు చంద్రబాబు అరెస్ట్ మినహా రాష్ట్రంలో మరే సమస్య లేనట్లు తెలుగుదేశం పార్టీ వ్యవహరించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడానికి బదులు సమావేశాలను బహిష్కరించే మార్గం ఎంచుకుంది. ఈ చర్య అధికార పార్టీ మరింత నిరంకుశంగా వ్యవహరించడానికి ఉపయోగపడింది.

శాసనసభ సమావేశాల్లో వైసిపి, టిడిపిలు అనుసరించిన ఈ వైఖరితో కీలకమైన ప్రజా సమస్యలు మరుగున పడ్డాయి. జిపిఎస్ బిల్లును ఆమోదించిన విధంగానే అసైన్డ్ భూముల చట్ట సవరణకూ, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తించాల్సిన క్రమబద్ధీకరణ ప్రయోజనాలను కొద్దిమందికే పరిమితం చేసేలా రూపొందించిన బిల్లునూ, ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ఆమోదింపచేసుకుంది. కేంద్రంలో బిజెపి ఒత్తిడికి తలొగ్గి పాఠశాల విద్యలో మూడవ భాషగా సంస్కృతాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఏకపక్ష ప్రకటన చేసింది. పోలవరం ముంపు బాధితుల పునరావాసంతో పాటు, అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, విద్యుత్ ఉద్యోగులు వంటి వివిధ తరగతుల ప్రజానీకానికి సంబంధించిన అంశాలను అసలు సమస్యలే కావన్నట్లు అధికారపక్షం వ్యవహరించింది. కొద్దిమందే ఉన్నా పిడిఎఫ్ సభ్యులు వీటిని లేవనెత్తడానికి మండలిలో పదేపదే చేసిన ప్రయత్నాల ఫలితంగా అరకొరగానైనా ప్రభుత్వం వీటిపై స్పందించాల్సి వచ్చింది. మొత్తంమీద ఈ అయిదు రోజుల అసెంబ్లీ సమావేశాలు నిస్సారంగా ముగిశాయనే చెప్పాలి. దీనికి ప్రధాన బాధ్యత అధికార పార్టీదే.

# అప్పట్లో.. శృంగార సమ్మతి వయసు 'పదేళ్లే'



దిల్లీ: లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనే విషయంలో 'సమ్మతి వయసు ను 18 ఏళ్ల నుంచి 16 ఏళ్లకు తగ్గించాలనే వాదనను లా కమిషన్ వ్యతిరేకించింది. పోక్సో చట్టం ప్రకారం ప్రస్తుతమున్న సమ్మతి వయసును మార్చడం అంత మంచిది కాదని తాజాగా కేంద్రానికి అందించిన నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలో దేశంలో లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనే వయసుకు సంబంధించి న్యాయ కమిషన్ పలు కీలక విషయాలను తన నివేదికలో వెల్లడించింది. 1860లో సమ్మతి వయసు 10 ఏళ్లుగా ఉండగా.. తదనంతరం క్రమంగా అది పెరుగుతూ వచ్చిందని తెలిపింది. సమ్మతి వయసు అంటే వివాహం లేదా లైంగిక చర్యకు అంగీకారం తెలిపేందుకు చట్టబద్ధంగా ఆమోదయోగ్య వయసు అని అర్థం. పోక్సో చట్టం ఆధారంగా ప్రస్తుతం మన దేశంలో సమ్మతి వయసు 18 ఏళ్లుగా ఉంది. 2012లో పోక్సో చట్టం రాకముందు.. అమ్మాయిలకు సమ్మతి వయసు 16 ఏళ్లుగా ఉంది. అదే పురుషులకు మాత్రం ప్రత్యేకంగా ఏమీ లేదు.

1860లో మహిళల సమ్మతి వయసు 10 ఏళ్లుగా ఉంది. అయితే, అప్పట్లో ఓ 11 ఏళ్ల బాలిక మరణం తీవ్ర నిరసనలకు దారితీసింది. ఆమె భర్త బలవంతంగా లైంగిక చర్యకు పాల్పడటంతో తీవ్ర రక్తస్రావమై.. చివరకు ప్రాణాలు కోల్పోయింది. నిర్లక్ష్యపు చర్య వల్ల అమ్మాయి ప్రాణాలకు ముప్పు కలిగించాడనే అభియోగాలపై ఆమె భర్తకు ఏడాది కఠిన శిక్ష పడింది. ఈ వ్యవహారంపై ప్రజాగ్రహం పెల్లుబికింది. దీంతో 1891లో సెక్షన్ 375 కింద ఈ వయసును 12 ఏళ్లకు పెంచారు. అనంతరం 1925లో ఈ సమ్మతి వయసును 14 ఏళ్లకు.. ఆ తర్వాత 1940లో మరోసారి 16 ఏళ్లకు మార్చారు. ఇలా 2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చే వరకు మహిళల సమ్మతి వయసులో ఎటువంటి మార్పు లేదు. ఈ చట్టం ప్రకారం 18 ఏళ్లకు పెంచినట్లు న్యాయ కమిషన్ పేర్కొంది.

ప్రపంచ వ్యాప్తంగా శృంగార సమ్మతి వయసు 13 నుంచి 18 ఏళ్ల మధ్యగా ఉంది. కెనడాలో 14ఏళ్లుగా ఉండగా.. 2008 నుంచి దాన్ని 16ఏళ్లకు పెంచారు. అమెరికాలో ఫెడరల్ చట్టం ప్రకారం 18ఏళ్లు. అయినప్పటికీ వివిధ రాష్ట్రాల్లో ఇది వేర్వేరుగా ఉంది. ఆస్ట్రేలియాలో పలు రాష్ట్రాల్లో 16 నుంచి 17ఏళ్లుగా ఉంది. జపాన్‌లో మొన్నటివరకు 13ఏళ్లుగా ఉండగా ఈ ఏడాదే దాన్ని 16ఏళ్లకు పెంచారు. అయితే, వివాహానికి కనీస వయసు పురుషులకు 18ఏళ్లుగా నిర్ధారించగా.. మహిళలకు 16ఏళ్లు. దక్షిణాఫ్రికాలో శృంగార సమ్మతి వయసు 16ఏళ్లు.

# క్యాబ్ డ్రైవర్ ఖాతాలో రూ.9వేల కోట్లు జమ..

## కొద్ది రోజులకే బ్యాంకు ఎండీ రాజీనామా..

చెన్నై: తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్ క్రిష్ణన్ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఉద్యోగాన్ని వీడుతున్నట్లు తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఒక కారు డ్రైవర్ బ్యాంకు ఖాతాలో పొరపాటున రూ.9 వేల కోట్లు జమ అయిన కొద్దిరోజుల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 'ఇంకా నా పదవీకాలం మిగిలి ఉన్నప్పటికీ.. వ్యక్తిగత కారణాలతో బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ పదవి నుంచి వైదొలుగుతున్నాను' అని క్రిష్ణన్ వెల్లడించారు. బ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఈ రాజీనామాపై సమావేశం నిర్వహించి.. ఆమోదం తెలిపారు. అలాగే దీనిపై ఆర్‌బీఐకి సమాచారం ఇచ్చారు. 2022లో క్రిష్ణన్ తన బాధ్యతల్లోకి వచ్చారు. ఓ కారు డ్రైవర్ ఖాతాలో టీఎంబీ బ్యాంకు పొరపాటున రూ.9 వేల కోట్లు జమ చేసిందని వార్తలు వెలువడిన వారం వ్యవధిలోనే ఈ రాజీనామా చోటుచేసుకోవడం గమనార్హం. పళని నెయ్‌క్కారపట్టికి చెందిన రాజ్‌కుమార్ చెన్నై కోడంబాక్కంలో స్నేహితుడి వద్ద ఉంటూ అద్దె కారు తిప్పుతున్నాడు. ఈ నెల 9న అతడి బ్యాంకు ఖాతాలో రూ.9 వేల కోట్లు జమైనట్లు సందేశం వచ్చింది. అది నిజమా, కాదా అని తెలుసుకునేందుకు తన ఖాతా నుంచి స్నేహితుడికి రూ.21 వేలు పంపాడు. నిజమేనని నిర్ధారణకు వచ్చి సంతోషించేలోగా ఖాతాలో ఉన్న మిగిలిన డబ్బును తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు వెనక్కి తీసుకుంది. తూత్తుకుడిలోని బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి రాజ్‌కుమార్‌కు అధికారులు ఫోన్‌చేసి పొరపాటున తన ఖాతాలో రూ.9 వేల కోట్లు జమ చేసినట్లు తెలిపారు. తన స్నేహితుడికి పంపిన నగదును కూడా తిరిగి చెల్లించాలని సూచించారు. చెన్నై టీనగర్‌లోని బ్యాంకు శాఖకు రాజ్‌కుమార్ తరఫున న్యాయవాదులు వెళ్లి మాట్లాడటంతో స్నేహితుడికి అతను పంపిన రూ.21 వేలు తిరిగి ఇవ్వాల్సిన పని లేదని, వాహన రుణం ఇస్తామని బ్యాంకు వారు చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ పొరపాటుకు.. సీఈఓ ఎస్ క్రిష్ణన్ రాజీనామాకు ఏదైనా సంబంధం ఉందా..? లేదా..? అనే విషయం తెలియాల్సి ఉంది.

# గొన్న కళాశాలలో వరల్డ్ హార్ట్ డే



పరవాడ :-స్థానిక గొన్న కళాశాలలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న జరుపుకుంటారు. వరల్డ్ హార్ట్ డే అనేది కమ్యూనిటీలు, వ్యక్తులు మరియు ప్రభుత్వం గుండె ఆరోగ్యాన్ని చూసుకోవడానికి మరియు వారి చుట్టూ ఉన్న ఇతరులకు దాని గురించి అవగాహన కల్పించడానికి కార్యకలాపాలలో పాల్గొనే ప్రచారం. ఈ ప్రచారం ద్వారా ప్రజలు హృదయ సంబంధ వ్యాధుల వల్ల కలిగే భారానికి వ్యతిరేకంగా పోరాడటానికి మరియు గుండె ఆరోగ్యానికి మంచి జీవనశైలిని ప్రోత్సహించడానికి చర్య తీసుకోవడానికి ప్రేరేపిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడి కవర్ సంస్థ ( డాక్టర్లు మరియు వారి సహచరులు) గొన్న కళాశాలకు వచ్చి సిపిర్ (కార్డిపుల్మనరీ రెసుసైటేషన్ ) గురించి ఆచార్యులకు మరియు విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. సిపిర్ అంటే కార్డియోపల్మోనరీ రిససిటేషన్. ఇది ఒక వ్యక్తి యొక్క శ్వాస లేదా హృదయ స్పందన ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రాణాలను రక్షించే ప్రక్రియ. విద్యుత్ షాక్, గుండెపోటు లేదా మునిగిపోవడం వంటి వైద్య అత్యవసర పరిస్థితి తర్వాత ఇది జరగవచ్చు. సిపిర్ రెస్క్యూ శ్వాస మరియు ఛాతీ కుదింపులను మిళితం చేస్తుంది. గొన్న కళాశాల మేనేజ్మెంట్ ఈ కార్యక్రమం లో ప్రసంగిస్తూ, సిపిఆర్ ఎలా చేయాలి అనేది నేర్చుకోవడం ప్రతి ఒక్కరికి చాలా అవసరం అని చెప్పారు, ఇది ఎన్నో ప్రాణాలు రక్షిస్తుంది అని తెలిపారు. అందువలన కళాశాలలో సిపిఆర్ ప్రక్రియ గురించి అవగాహన కల్పిస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొన్న కళాశాల చైర్మన్ పూజిత హనీషా, ట్రెజరర్ పూర్ణ, ప్రిన్సిపల్ పి ఎస్ఎన్ మూర్తి, ఇంచార్జ్ భారతి తదితరులు పాల్గొన్నారు..

## సమకవియం

### 'లేవండి... మేల్కొనండి...'

జాతిని మేల్కొల్పి
జన్మించి
మనిషికి మూఢ విశ్వాసం
ప్రభల శత్రువని
మనసుని బలహీనపరచే
వినాశనకారి అని తెల్పి
వీటిని అధిగమింప
దివ్య ఉపనిషత్తులను
ఆశ్రయించమని
ప్రభోధించి
స్పందించే హృదయం
ఆలోచించే మెదడు
సహాయ పడే గుణం
యువతకు ప్రథమ లక్షణమని
ఓ... నా ధీర వత్సలారా...
లేవండి... మేల్కొనండి...
మహత్కార్యాలు సాధించడానికే
మనం జన్మించామని
యువకులను సంఘటిత పరచడానికి
తాను జన్మించానని
ఎలుగెత్తి చెప్పిన
మార్గదర్శకుడు
వివేకానందుడు.

...రచయిత
ఆర్.శంకర్

# నేటి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



పరవాడ:-నేటి ఉదయం 8.30 గంటలకు పరవాడ జెడ్ పి హెచ్ స్కూలు( బాలుర) నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి శాసన సభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజ్ మరియు పరవాడ మండల ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనువాసరావు, మండల జడ్పీటీసీ పీస్ రాజు హాజరగుదురు అని వైసిపి మండల పార్టీ ప్రెసిడెంట్ కోన రామారావు పేర్కొన్నారు . ఈ యొక్క కార్యక్రమంలో మండల అదికారులు మండల వైస్ ఎంపీపీ లు బందం నాగేష్ , భూస అప్పల రాజు మరియు స్థానిక సర్పంచ్ సిరపురపు అప్పల నాయుడు పాల్గొందురు. కావున మండలంలో గల పార్టీ సర్పంచ్లు, ఎంపీటీసీ లు, జిసియస్ కన్వీనరు, మండల పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ నామినేటెడ్ మరియు పార్టీ పదవులలో వున్న నాయకులు సచివాలయ కన్వీనర్లు గ్రామ వాలంటీర్లు గృహ సారదులు ఈ యొక్క కార్యక్రమానికి హాజరు కావాలని కోనరామారావు కోరారు..

# సంకల్ప ఫల రైతు ఉత్పత్తిదారుల 4వ వార్షికోత్సవం



పరవాడ:-పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో సంకల్పఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, 4వ వార్షిక మహా జనసభ ను జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మరియు పరవాడ హార్టికల్చర్ ఆఫీసర్ లావణ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా లావణ్య మాట్లాడుతూ సంకల్పఫల రైతు కంపెనీ కి పదిహేను లక్షల విలువగల పంట సేకరణ కేంద్రం( కలెక్షన్ సెంటర్ ) మంజూరు చేశామని నిర్మాణం కొంత వరకు పూర్తయింది అని, పూర్తి స్థాయిలో వచ్చే నెలలో నిర్మాణం పూర్తి చెయ్యాలని తెలియ జేశారు, అంతే కాకుండా రైతుల పంటలను మార్కెటింగ్ చేసుకోవడానికి వెహికిల్ ఇస్తామని తెలియజేశారు, అనంతరం జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో వ్యవసాయ సంబంధిత సేవలు అందిచలానే సంకల్పతో జాగృతి సంస్థ మార్గదర్శకులు కీ"శే " శ్రీ కందర్ప రామకృష్ణ స్థాపించడం అయినది, 18 గ్రామాల్లో 551 మంది రైతులకు వ్యవసాయ సేవలు అందిస్తున్నారని, వ్యవసాయ తరహా శిక్షణ కార్యక్రమాలు, యాంత్రీకరణ ఏర్పాటు చేస్తామని రైతు సభ్యులకు తెలిపారు,

తదుపరి రైతు బరోసా కేంద్రం అగ్రికల్చర్ ఆఫీసర్ హారిక మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు, ఈ ఆర్థిక సంవత్సరం జరిగిన లావాదేవీలు మరియు ముఖ్యాంశాలు సీఈఓ యం.వెంకటేశ్వర్లు తెలియ జేశారు, తనంతరం రైతుల కంపెనీ చైర్మన్ సీతిని అప్పారావు వందన సమర్పణతో వార్షికోత్సవ సమావేశం ముగిసింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా జాగృతి సంస్థ మేనేజింగ్ డెరైక్టర్ కందర్ప సుజాత, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ పరవాడ మండల లావణ్య , ఆర్ బి కే నుండి హారిక ,చైర్మన్. జాగృతి కన్సల్టెన్సీ వివి సుబ్రహ్మణ్యం. అగ్రి కన్సల్టెంట్ రెడ్డి నాయుడు. శీతిని అప్పారావు, మాటురి రమణమ్మ, పాలక వర్గ సభ్యులు , రైతులు, తదితరులు హాజరైయ్యారు

# ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!




శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించు కోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

# చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

# దర్యాల తిప్ప అభివృద్ధికి విశేష కృషి రామకృష్ణంరాజుకి
# గ్రామస్తులు ఘన సన్మానం



యానం. విజయ భాను సెప్టెంబర్ 28 కేంద్రపాలిత ప్రాంతమైన యానం చివరు దర్యాలతిప్ప గ్రామ అభివృద్ధికి ఓఎన్జిసి అనుబంధ సంస్థ శ్రీ రాధా ఎంటర్ప్రైజెస్ అధినేత రామకృష్ణంరాజు అన్ని విధాలుగా ఆర్థిక సహాయం చేయడంతో ఆ గ్రామ ప్రజలు ఘనం గా సత్కరించారు సముద్ర గర్భంలో ఓఎన్ఈసి సుమారు ఐదు నెలలపాటు చేపట్టిన అభివృద్ధి పనులు లో భాగంగా దర్యాల తిప్ప కేంద్రంగా చేసుకొని అన్ని పనులు నేరుగా సముద్రంలోకి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు పుదుచ్చేరిప్రభుత్వం యానం ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో స్థానిక అధికారులు సహాయ సహకారాలతో సర వేగంగా పనులు చేపట్టారు దీనికి నాలుగు గ్రామాలు పూర్తిగా సహాయ సహకారాలు అందించారు. ఈ గ్రామాలకు కాంట్రాక్టర్ రామకృష్ణంరాజు దేవాలయాలకు విద్యాలయాలకు ఆర్థికంగా అన్ని విధాలుగా సహాయపడ్డారు దీంతో ఆ గ్రామ ప్రజలు కాంట్రాక్టర్ రామకృష్ణంరాజును పూలమాలలు దుస్సలువలతో ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు గతంలో ఈ విధంగా ఎవరు ఈ గ్రామాలకు అభివృద్ధికి సహకరించలేదని రామకృష్ణ రాజు చేసిన సేవలను ఎప్పటికీ మర్చిపోలేని అన్నారు కాంట్రాక్టర్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఓఎన్జిసి పైపులైన్ పనులకు ఈ నాలుగు గ్రామాల ప్రజల అన్ని విధాలుగా సహకరించారని తన వంతు సహకారం చేయడం జరిగిందన్నారు అలాగే ప్రజాప్రతిథులు అధికారులు సహాయం మర్చిపోలేని అన్నారు నాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో దర్యాలతిప్ప సీతారాం నగర్ దొమ్మేటి పేట బాలయోగి నగర్ ఉదయ కృష్ణ కాలనీ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం రవాణా కు జీపీఎస్ తప్పనిసరి

## జిల్లా రవాణాశాఖ అధికారి



పార్వతీపురం విజయ భాను న్యూస్ సెప్టెంబరు29 : ప్రభుత్వం సేకరించిన ధాన్యం రవాణా చేయు వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి అని జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. ధాన్యం రవాణా చేయుటకు సంబంధిత రవాణా యాజమాన్యాలతో జిల్లా రవాణా కార్యాల యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2023-24 సీజనుకు సంబంధించి జిల్లాలో ధాన్యము కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అవుతున్న తరుణంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కళ్ళం నుంచి లేదా ప్రభుత్వము నిర్దేశించిన ప్రదేశము నుంచి యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన మిల్లుకు వెంటనే తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దీనికి సొంత వాహనాలు కలిగిన యజమానులు లేదా రైతులు తమ వాహనాలను వినియోగించ వచ్చుని,ఆ వాహనాలకు వాటి యజమానులే సొంతంగా జి.పి.ఎస్ పరికరాలను అమర్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జీపీఎస్ ఉన్న వాహనదారులు మాత్రమే ధాన్యం రవాణాలో పాల్గొనుటకు అర్హత పొందుతారని ఆయన పేర్కొన్నారు. జీపీఎస్ లేని వాహనాలకు బిల్లుల చెల్లింపులు కూడా జరగదని ఆయన స్పష్టం చేశారు. జీపీఎస్ పరికరం విలువ రూ.2,800 గా ఉందని, దానితో పాటు జి.ఎస్.టి చెల్లించాలని ఆయన వివరించారు. పౌర సరఫరాల శాఖ ఈ మేరకు కొన్ని ఏజెన్సీ లను గుర్తించిందని, వారు సంబంధిత జిల్లాల అవసరాల మేరకు జీపీఎస్ పరికరాలు లభ్యంగా పెడతారని చెప్పారు. వాహన యజమానులు తమ వాహన వివరాలను జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయములో సమర్పించి,వాహన వివరాలను అక్టోబరు 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం శశి కుమార్, రవాణా అసోసియేషన్ అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు

# గుండె యొక్క విలువ తెలుసుకొని జాగ్రత్తగా కాపాడుకోవాలి

- సూర్య గ్లోబల్ హాస్పటల్స్ అధినేత బిహెచ్ పి ఎస్ వీర్రాజు - వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హార్ట్ వాక్




కాకినాడ రూరల్,సెప్టెంబర్ 29: ప్రతి ఒక్కరూ గుండె యొక్క విలువ తెలుసుకొని జాగ్రత్తగా కాపాడుకోవాలని,మంచి ఆరోగ్యానికి మంచి ఆహార నియమాలు పాటించాలని సూర్య గ్లోబల్,టీమ్ హాస్పటల్స్ అధినేత బిహెచ్ పి ఎస్ వీర్రాజు సూచించారు.వరల్డ్ హార్ట్ డే హందర్భంగా టీమ్,సూర్య గ్లోబల్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో హార్ట్ వాక్,అవగాహన సదస్సు కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్.ఎస్.ఎన్ పాండా మాట్లాడుతూ యూజ్ హార్ట్,నౌవ్ హార్ట్ గా 2023 థీమ్ గా తీసుకురావడానికి గుండే వ్యాధుల నివారణకు దోహద పడుతుందని తెలియజేసారు. ప్రస్తుత కాలంలో చిన్నవారు మొదలుకొని వృద్ధులవరకు అనేకమంది గుండెపోటు బారిన పడుతున్నారని, దీనికి ముఖ్య కారణము యువతలో చోటు చేసుకున్నటువంటి దురలవాట్లు, చెడు తిండ్లు కారణమని, సరియైన వ్యాయామము లేకపోవుట ప్రతి ఒక్కరిలో యుద్ధ ప్రాతిపదికన అవగాహన కలిగించకపోతే మరణాల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంటుందన్నారు.రెగ్యులర్ చెకప్ లు చేయించుకోవడం ఎంతో అవసరమని అన్నారు.ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్.యు.ఆదినారాయణ మాట్లుడుతూ దాదాపుగా సంవత్సరానికి 30 వేల మంది మరణిస్తున్నారని అందులో గుండెపోటుతో మరణించినవారి 70 శాతం అని అందులో 30 సం. నుండి 60సం. మధ్య వయస్సు ఉన్నవారే ఎక్కువ అని అన్నారు.పొగ త్రాగుట,అధిక మొత్తంలో మద్యం సేవించుట, సరైన వ్యాయామం లేకపోవుట, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకొనుకపోవుట, నిద్రలేమి, అధిక ఒత్తిడి,అవగాహనారాహిత్య జీవితానికి గురికావడం వలన అత్యధికమందికి గుండెపోటుకు గురవుతున్నారని వివరించారు. ఈ సందర్భముగా కార్యక్రామపికి విచ్చేసిన ప్రముఖ యోగా గురువు సూర్యనారాయణరావు మాట్లాడుతూ ప్రజలకు యోగా యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. యోగా మనిషి యొక్క ఆయువుని పెంచుతుందని తెలియజేశారు. ప్రముఖ డైటీషియన్ వరలక్ష్మి ప్రజలకు అవసరమైన ఆహార విషయములలో

పాటించవలసిన జాగ్రత్తలు సూచించినారు. కార్యక్రమంలో హాస్పటల్స్ చైర్మెన్ డాక్టర్ వీర్రజు మాట్లుడుతూ కేవలం జనచైతన్యం కొరకు సూర్యగ్లోబల్, టిమ్ హాస్పిటల్స్ ప్రభుత్వానికి సహకరిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టుచున్నామని, ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనేక మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, ఎవరికి ఏ చిన్న హృదయ సంబంధిత వ్యాధి వచ్చినా పూర్తిగా ఉచితంగా సేవలు అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ గుండె యొక్క విలువ తెలుసుకొని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, వైద్యులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుటకు పరోక్ష కారకులు అయిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికు ధన్యవాదములు తెలిపారు.

## ఇనోదయాలో ఉచిత వైద్య శిబిరం



కాకినాడ, సెప్టెంబర్ 29: కాకినాడ ఎన్ఎఫ్సీఎల్ రోడ్లో ఉన్న ఇనోదయ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ గుండె వ్యాధి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా ఈ శిబిరంలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హాజరైన వారికి ఇసిజి, హెచ్బిఎస్, ఆర్బిఎస్, 2డీ ఈకో వంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు మదన్, ప్రశాంతి, గీత కుమారి, వరప్రసాద్ రామ్మోహన్, సత్య సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాజూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ చిట్టివలస బొగ్గరోడ్డు లో ఉన్న శ్రీ కృష్ణ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ కళాశాల కరస్పాండెంట్ , చైర్మన్ బి. నర్సింగ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా ఆటలు పాటలతో అందరినీ అలరించారు.అనంతరం నర్సింగ్ రావు విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీ కృష్ణ కళాశాలలో నైతికలతో కూడినటువంటి విద్యను విద్యార్థులుకు అందిస్తున్నామనీ అన్నారు. అంతేకాకుండా విద్యార్థులు కష్టపడి చదివేవిధంగా రిజల్ట్ ఇవ్వడమే ప్రథమ ధ్యేయంగా నడిపించడం జరుగుతుందనీ చెప్పారు. విద్యార్థిని,విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదివి కళాశాలకు మంచి పేరు తెస్తున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు.

అనంతరం ఇంటర్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులును బహుమతులు ఇచ్చి సత్కరించారు. అదేవిధంగా కళాశాలలో పనిచేసే ప్రతిభ చూపిన అధ్యాపకులుకు సన్మానం చేసారు. అకాడమిక్ ప్రిన్సిపాల్ ఐ.రాజేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తాతారావు, అధ్యాపకులు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్ లో క్రొవ్వొత్తుల ర్యాలీ



రాజాం (విజయభాను న్యూస్) : మాజీ మంత్రి వర్యులు తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ సూచనల మేరకు పట్టణంలో 17 వ వార్డు ఆదర్శనగర్ కాలనీ, అమ్మవారి కోలనీలో పార్టీ సీనియర్ నేత మరిపి జగన్మోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరశిస్తూ ఈకార్యక్రమం చేపట్టామని జగన్మోహనరావు వెల్లడించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు పెంకి. గౌరీశ్వరరావు, గంధం గోపి. చైతన్య, దన్నాన, శ్రీను, అసిరినాయుడు తదితరులుతో పాటు అభిమానులు గౌరి, రాధ, సత్యం, ప్రసాద్పా తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రిలే దీక్షలు



రాజాం (విజయభాను న్యూస్) : మాజీ ముఖ్యమంత్రి , తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సామూహిక రిలే నిరాహారదీక్ష కార్యక్రమం మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీ మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. చంద్రబాబు అక్రమ స్కిల్ డెవలప్మెంట్ కేసుకు నిరసనగా “బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం” అంటూ టీడీపీ కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు. ఈసందర్భంగా కోండ్రు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు 45 ఏళ్ళ రాజకీయ జీవితంలో ఎన్నో సంస్కరణలు, చారిత్రాత్మక విజయాలు, ఉన్నాయని, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి ని అక్రమంగా అరెస్ట్ చెయ్యడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చీకటి రోజులు వైసీపీ ప్రభుత్వం లో అమలయ్యాయని, ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. న్యాయస్థానంలో చంద్రబాబు కడిగిన ముత్యంలా తీసుకు వచ్చేందుకు కృషిచేద్దాంమని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మరిపి జగన్మోహనరావుతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నా మట్టి నా దేశం



రాజాం (విజయభాను న్యూస్) : మేరా మిట్టీ- మేరా దేశ్ పేరుతో సంతకవిటి మండలం మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీను ప్రధానోపాధ్యాయులు ఉరిటి రవిశంకర్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముందుగా నేల తల్లికి నమస్కారం చేసి అమరవీరులకు వందనం చేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరవీరుల చేసిన దేశ సేవను విద్యార్థులకు వివరించారు . ప్రతి ఒక్కరు కూడా దేశభక్తిని కలిగి ఉండాలని దేశానికి సేవ చేయాలని ఎవరికి వారే పరిశుభ్రతను పాటించాలని స్వచ్ఛతను పాటించాలని దేశ ఉన్నతకై పాటుపడాలని వివరించారు. గ్రామ వీధుల్లో విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గడే అప్పలనాయుడు .పల్లి గౌరీ నాయుడు .షేక్ జాఫర్ .పోతురాజు సీతారాం గెడ్డాపు పాపారావు రాకోటి శ్రీనివాసరావు. ఎస్ వెంకటరమణ. కూన కుమారి . జక్క ఆనంద్ కుమార్ బి నాగభూషణరావు. కెంబూరు బూరు ప్రతాప్ కుమార్ తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ వారి ఆలయంలో ఘనంగా చండీ హెూమం



అన్నవరం.......కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు.ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యహ వచనం,అమ్మవారికి మూల,మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11 గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కూచిభట్ల ప్రసాద్, యడవల్లి ప్రసాద్ మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవసానం సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు,దేవస్థానం అధికారులు, సిబ్బంది మరియు భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదములు అందజేశారు.

# పాఠశాలలో అదనపు బోరు కావాలి

**అనంతగిరి మండలం గుమ్మకోట ఏపిఆర్ గురుకులం పాఠశాలలో సందర్శించిన అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు**




అనంతగిరి, విజయభాను న్యూస్ : ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి గంగరాజు ప్రిన్సిపాల్ నరసింహమూర్తి తో మాట్లాడుతూ గురుకులం పాఠశాల సమస్యలపై అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో కరెంట్ సింగిల్ ఫేస్ కావడంతో ఓవర్ నైట్ రెండు టేంక్ లు 2 హెచ్ పి 1 హెచ్.పి మోటర్లు రెండున్నాయి ఫేన్ లు 100 ఉన్నాయి గ్రౌండర్స్ టేబ్స్ సిస్టమ్స్ ఉండడంతో కరెంట్ లోడు సరిపోవడం లేదని డబ్బల్ ఫేస్ లేద త్రి ఫేస్ ఇవ్వాలని పాఠశాలలో అదనపు బోరు కావాలని జడ్పిటిసి గారి దృష్టికి సమస్యలు చెప్పడం జరిగింది. పాఠశాలలో 487 మంది విద్యార్థులు ఉన్నారు

విద్యార్థుల విద్య మెరుగు పడవలసిన అవసరం ఉంది, ఏపిఆర్ గురుకులం ఇంగ్లీషు మీడియం,7 వ తరగతి 10 వ తరగతి విద్యార్థులను పాఠ్య పుస్తకాలు చదివిస్తే తడబాటులు ఉన్నాయి బాగ చదవాలని సూచించడం జరిగింది, త్రాగునీరు సమస్య ఉందని ప్రిన్సపాల్ తెలుపగా ఇంకా వారి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ శ్రీ సుమీత్ కుమార్ వారి దృష్టికి,ఐటిడి తెలుపగా ఎ ప్రాజెక్టు అధికారి శ్రీ వి.అభిషేక్ గారు జిల్లా చైర్మన్ జల్లిపల్లి. సుభద్ర వారి దృష్టికి తీసుకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో.మోస్య,సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు,గిరిజన సంఘం కార్యదర్శి జన్ని సుబ్బారావు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



# లివర్ చెడిపోయేందుకు ముఖ్య కారణాలివే..!




మన శరీరంలో లివర్ అత్యంత పెద్దదైన అవయవం. ఇది చేసే పనులు ఎంతో ముఖ్యమైనవి. మనం తిన్న ఆహారాన్ని జీర?ం చేయాలన్నా, శరీరానికి శక్తి సరిగ్గా అందాలన్నా, విష పదార్థాలు బయటికి వెళ్లాలన్నా లివర్ ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అయితే నేటి తరుణంలో మనం తింటున్న అనేక ఆహార పదార్థాలు, పలు వ్యాధులు, అలవాట్లు లివర్ చెడిపోవడానికి కారణమవుతున్నాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1. చక్కెర లేదా తీపి అధికంగా ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బ తింటుంది. చక్కెరను అతిగా తింటే అది శరీరానికి ఉపయోగం కాదు సరికదా, అది మొత్తం లివర్‌లోనే పేరుకుపోయి కొవ్వుగా మారుతుంది. దీంతో కొంత కాలానికి లివర్ పనితీరు మందగించి అది చెడిపోతుంది.

2. నేటి తరుణంలో ఆహార పదార్థాలను రుచిగా అందించడానికి వాటిలో మోనోసోడియం గ్లుటమేట్ అనే పదార్థాన్ని ఎక్కువగా కలుపుతున్నారు. దీంతో ఈ పదార్థం ఉన్న ఆహారాన్ని తిన్నప్పుడు అది మన శరీరంలోకి ఎక్కువగా చేరుతోంది. దీని ప్రభావం ఎక్కువగా పడడంతో లివర్ చెడిపోతోంది.

3. విటమిన్ ఎ ఉన్న ఆహారం తీసుకుంటే కంటి సంబంధ సమస్యలు ఉండవని అందరికీ తెలిసిందే. అయితే ఈ విటమిన్ శరీరంలో మోతాదుకు మించినా దాని ప్రభావం లివర్‌పై పడుతుందట. దీంతో లివర్ ఆరోగ్యం నాశనమవుతుందట.

4. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగడం వల్ల కూడా కాలేయం త్వరగా చెడి పోతుంది. కూల్ డ్రింక్స్ లో ఉండే పదార్థాలు కాలేయాన్ని పని చేయకుండా చేస్తాయి.

5. ఉప్పు ఎక్కువగా తినడం వల్ల శరీరంలో ద్రవాల శాతం అధికంగా పెరుగుతుంది. దాంతో కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. ఉప్పువల్ల రక్తపోటు కూడా వస్తుందనే విషయం తెలిసిందే.

6. చిప్స్ వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తిన్నా వాటిలో ఉండే విషపూరితమైన పదార్థాలు లివర్ ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి వాటికి కూడా దూరంగా ఉండడం మంచిది.

7. అధిక బరువు ఉన్నవారు కూడా లివర్ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. శరీరంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతే ఫ్యాటీ లివర్ డిసీజ్ వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కొన్ని సందరాల్లో లివర్ ఫెయిల్ అవుతుంది కూడా.

8. డయాబెటిస్ సమస్యతో బాధపడే వారికి లివర్ వ్యాధులు వచ్చే అవకాశం 50 శాతం వరకు ఉంటుంది.

9. ఉప్పు ఎక్కువగా తింటే దాంతో బీపీ పెరిగి అది ఫ్యాటీ లివర్ వ్యాధికి దారి తీస్తుంది. కనుక ఉప్పును చాలా తక్కువగా తినడం మంచిది.

10. యాంటీ డిప్రెస్సెంట్స్, మూడ్ స్టెబిలైజర్స్, కార్టికోస్టెరాయిడ్స్, పెయిన్ రిలీవర్స్ వంటి పలు రకాల మెడిసిన్‌లను దీర కాలం వాడినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది. డాక్టర్ల సిఫారసు లేకుండా సొంతంగా మందులను వాడినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది.

11. క్యాన్సర్ చికిత్స కోసం చేసే కీమోథెరపీ వల్ల కూడా లివర్ చెడిపోతుంది.

12. హెపటైటిస్ ఎ, బి, సి వంటి వ్యాధులు వచ్చినప్పుడు సరైన సమయంలో స్పందించి చికిత్స చేయించుకోకపోయినా లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది.

13. పేగుల్లో ఇన్‌ఫెక్షన్లు ఏర్పడి అవి తీవ్రతరమైనా లివర్ చెడిపోయేందుకు అవకాశం ఉంటుంది.

14. క్రిమి సంహారక మందులను వాడి పండించిన కూరగాయలు, పండ్లను తింటే వాటితో ఆ మందులు కూడా మన శరీరంలోకి వెళ్తాయి. అప్పుడు ఆ మందులు లివర్‌పై ప్రభావం చూపిస్తాయి.




# కళ్లకు వ్యాయామం తప్పనిసరి



రోజంతా ఆఫీసులో కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేయడం, ఇంటికి వచ్చాక టీవీకి అతుక్కుపోవడం లేదా ల్యాప్‌టాప్ ముందుకు కూర్చునే వారి సంఖ్య ఎక్కువే. అయితే ఈ విధంగా గంటల తరబడి కంప్యూటర్లు, టీవీల ముందు కూర్చోవడం వలన చిన్న వయసులోనే కళ్ల సమస్యలు ఏర్పడతాయి. కంప్యూటర్ నుంచి వెలువడే పవర్ వలన కళ్ల చూపు మందగించే ప్రమాదం ఉంది. కనుక కళ్ల కోసం కొంత టైమ్ కేటాయించాలి. కళ్ల సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే కళ్లకు అప్పుడప్పుడు కాస్తంత విశ్రాంతిని ఇస్తూ, చిన్న పాట వ్యాయామాలు చేయడం మంచిది. అవి ఎలా చేయాలో మీ కోసం. రెండు అరచేతుల్ని కలిపి రుద్దితే కొన్ని నిమిషాలకు వేడెక్కుతాయి. వాటిని కళ్లపై ఉంచండి. ఇలా చేస్తున్నప్పుడు కళ్లు తెరవకూడదు. కళ్లపై వెలుతురు పడకూడదు. ఇలా రోజులో కుదిరినప్పుడల్లా చేసి చూడండి. కళ్లకు హాయిగా అనిపిస్తుంది.

కంప్యూటరుపై పనిచేసే వారిలో చాలా మంచి కనీసం రెండు నిమిషాలు కూడా కళ్లు మూసి తెరవరు. దాంతో కళ్లు అలసిపోతుంటాయి. ఇలాంటి వారు తరచూ కనురెప్పల్ని మూసి తెరవడం ఓ అలవాటుగా మార్చుకోవాలి. ఇలా ఎన్ని ఎక్కువ సార్లు చేస్తే అంత మంచిది.

కంప్యూటరు ఎదురుగా కూర్చుని పనిచేసే వారు దూరంగా ఉండేవి చూడటంలో ఇబ్బందిపడతారు. దాన్ని అధిగమించాలంటే ప్రతి అర గంటకోసారి ఐదు సెకన్లు దూరంగా ఉండే వస్తువుల్ని చూడాలి. ఇది కళ్లకెంతో మేలు చేస్తుంది. ఇక కళ్లు బాగా అలసిపోయినట్లు అనిపిస్తుంటే, కాసిని నీళ్లు జిలకరించుకోండి. లేదా చన్నీళ్లతో కళ్లను తుడుచుకోండి. దీన్ని కళ్లపై ఉన్న ఒత్తిడిపోయి తాజాగా మారతాయి.

సౌకర్యంగా కూర్చుని చేతి బొటనవేలిని కంటికెదురుగా పెట్టుకుని దాన్న చూడాలి. తరువాత వేలిని దూరంగా ఉంచి మళ్లీ దృష్టిని దానిపై నిలపాలి. ఇలా కొన్ని నిమిషాలు చేస్తే కళ్లకు విశ్రాంతి లభిస్తుంది.

ఈ విధంగా చేయడం వలన కళ్ల చూపు సమస్యలు దరిచేరవని వైద్య నిపుణులు తేల్చి చెబుతున్నారు.

# క్యారెట్ వల్ల పొందే అదనపు ప్రయోజనాలు

**రోజూ** మనం తీసుకునే కూరగాయలలో ఎన్నో విటమిన్లు మన శరీరానికి లభిస్తున్నం దువల్లే మనం ఆరోగ్యంగా ఉండ గల్గుతున్నాం. ముఖ్యంగా చెప్పాలంటే వాటిలో క్యారె ట్‌ను మించింది మరొకటి లేదు. క్యారెట్‌లో ఎన్నో విటమిన్లతోపాటు మన జీవనాన్ని, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే లక్షణాలు పుష్కలంగా వున్నాయి. విటమిన్లు, ఖనిజాలు రెండింటి ఉత్తమ సమతౌల్యంగల కూరగాయ క్యారెట్. తాజా క్యారెట్‌లో మనశరీరానికి అత్యంత ముఖ్యంగా కావలసిన 12 ఖనిజ లవణాల సమతౌల్యాన్ని మనం ఇందులో చూడగలం. మితంగా ఉపయోగపడే పరిమాణ ములో క్యారెట్ విటమిన్ బి.సి.జి లను ఇస్తూ శరీరానికి అవసరమైన పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, సోడియం, మాంగనీస్, సిలికాన్, అయోడిన్ లతో పాటు సల్ఫర్, భాస్వరం, క్లోరిన్ వంటి ఖనిజాలను సరఫరా చేస్తుంది. అతి ఉత్తమమైన, సహజమైన కాల్షియం (సున్నం) చక్కటి సమతౌల్యాన్ని అద్భుతంగా ఇది ఇవ్వగలద. క్యారెట్ ప్రయోజనాలు మహిళ కంటే, పురుషులకే ఎక్కువగా ఉన్నాయడంలో ఆశ్చర్యం కలగక మానదు. ఎందుకంటే పురుషులు, రోజూ ఒక ఆపిల్ తినడం కంటే ఒక క్యారెట్ తినడం వల్ల గొప్ప ప్రయోజనాలను పొందవచ్చు అంటారు.

పురుషులుతీసుకొనే ఆహారాల్లో మార్కెట్లో ఉండే అన్ని వెజిటేబుల్స్ లో కంటే క్యారెట్స్ లో అనేక ఆరోగ్యప్రయోజనాలున్నాయి. ఆ ప్రయోజనాలేంటని మనకు ఆశ్చర్యం కలగవచ్చు?క్యారెట్ లోని బీటాకెరోటిన్ స్త్రీలకు మాత్రమే కాదు, పురుషులకు కూడా అధిక ప్రయోజనాలను అంధిస్తుంది. ఆహారనిపుణల ప్రకారం, ఈహెల్తీ వింటర్ వెజిటేబుల్ ను కనీసం వారంలో రెండు సార్లు తీసుకోవాలని అంటున్నారు.

ఈ వింటర్లో ఎదురయ్యే అన్ని ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచే శక్తి సామర్థ్యం క్యారెట్స్ లో పుష్కలంగా ఉంది. క్యారెట్స్‌ను ముఖ్యంగా పురుషుల డైట్ లిస్ లో చేర్చుకోవడానికి ప్రధాన కారణాలేమిటి, వాటి ఆరోగ్యప్రయోజనాలేంటి అన్న విషయాన్ని తెలుసుకోండి. ప్రతి రోజూ క్యారెట్స్ ను తీసుకోవడం వల్ల పురుషులకు కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ ఉన్నాయి. ముఖ్యంగా, 30 ఏళ్ళ వయస్సు దాటిన పురుషులు వారి రెగ్యులర్ డైట్ లో క్యారెట్ ను తప్పనిసరిగా చేర్చుకోవాలి. కాబట్టి, పురుషులు డైట్‌లో క్యారెట్స్ తప్పనిసరి తీసుకోవాలి.

**వీర్యకణాలను మెరుగుపరుస్తుంది:** ఆరోగ్యనిపుణుల ప్రకారం క్యారెట్ లోని అనేక విటమిన్లు, మినరల్స్, కెరోటినాయిడ్స్ పురుషుల్లో వీర్యకణాల క్వాలిటీని మెరుగుపరచడానికి సహాయపడుతం దిని చెబుతున్నారు. కాబట్టి, ఫ్యామిలీ కోసం ప్రయత్నించే వారు వారానికొకసారి క్యారెట్స్ జ్యూస్‌ను తీసుకోవాలి.

**జీర్ణక్రియ:** క్యారెట్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది . పురుషులు ఎవరైతే, జీర్ణక్రియ సమస్యలతో బాధపడుతు న్నారో వారు, వారి రెగ్యులర్ ఆహారంలో రోజుకు రెండు సార్లు క్యారెట్స్ ను జోడించండి.

**స్టొమక్ డిజార్డర్:** పురుషులకు క్యారెట్స్ చాలా ఆరోగ్యకరం. పురుషుల్లో వచ్చే అన్నిరకాల డిజార్డర్స్ ను క్యారెట్స్ నివారిస్తుంది. పురుషుల్లో గ్యాస్ట్రిక్ సమస్యను చాలా తేలికగా నివారిస్తుంది.

**కొలెస్ట్రాల్ తగ్గించుటకు:** పురుషులకు క్యారెట్ యొక్క బెస్ట్ బెనిఫిట్, వారిలో కొలెస్ట్రాల్ ను తగ్గించాడానికి సహాపడుతుంది. ప్రతి రోజూ డిన్నర్ తర్వాత ఒక గ్లాస్ క్యారెట్ జ్యూస్ ను తీసుకోండి.

**కళ్ళ ఆరోగ్యానికి :** పురుషులకు ఈ వింటర్ వెజిటేబుల్ యొక్క ముఖ్య ప్రయోజన కంటిచూపును మెరుగుపరుస్తుంది. కంటిచూపును మెరుగుపచడంతో పాటు దీర్ఘకాలిక చూపును మెరుగుపరుస్తుంది.

**గుండె ఆరోగ్యానికి :** గుండెను ఆరోగ్యంగా ఉంచి, గుండె వ్యాధులు రాకుండా కాపాడుతుంది. యారెట్ గుండెకు సంబంధించిన వ్యాధులను దూరం చేస్తుంది. గుండెల్లో మంటగా ఉంటే క్యారెట్‌ను ఉడకబెట్టండి. దానిని చల్లార్చిన తర్వాత ఒక కప్పు రసంలో ఒక చెంచా తేనెను కలిపి సేవించండి. దీంతో గుండెల్లో మంటగా ఉంటే అది మటుమాయం అవుతుంది.

**దంత సంరక్షణకు:** క్యారెట్ల జ్యూస్ వల్లా, క్యారెట్‌ను పచ్చిగా అలాగే తినడం వల్లా నోటి అల్సర్ నివారణ సాధ్య మవుతుంది. క్యారెట్, టమోటా, బత్తాయి పండ్ల రసాలను సమపాళ్ళలో తీసుకుని రెండు నెలల పాటు క్రమం తప్పకుండా వాడి నట్లయితే, నోటి అల్సర్‌నున పూర్తిగా నివారించవచ్చు.

**వ్యాధినిరోధక శక్తి పెంపునకు:** క్యారెట్‌లో రక్తహీనతను పోగొట్టే గుణం ఉంది. రక్తహీనతకు కూడా క్యారెట్ దివ్య ఔషధంగా పనిచేస్తుంది. అధిక పోషక విలువలుండటం వల్ల క్యారెట్‌లో రోగ నిరోధక శక్తి కూడా అధికంగానే ఉంటుంది. ఇందులోని రోగ నిరోధకశక్తి వలన కఠినమైన మొండి రోగాలు, దీర్ఘ వ్యాధులకు సైతం చెక చెప్పవచ్చునం టున్నారు డాక్టర్లు.

నేటి ఆధునిక యుగంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, ప్రకృతిలో చోటుచేసుకున్న మార్పులతో పాటు పలు కారణాల వలన మనలను పలు రకాలైన అనారోగ్యాలు వెన్నంటే వుంటాయి. అయితే ఎటువంటి ఆరోగ్య సమస్యలలైనా ఆదిలోనే హరించే దివ్యౌషధం మంచి నీళ్లే అని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రతి రోజు ఉదయం పూట లీటరు మంచి నీళ్లు తాగితే పలు రోగాలు మటుమాయమవుతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

కార్యాలయాల్లో ఉద్యోగస్తులు రోజుకు తొమ్మిది, పది గంటల పాటు ఒకే సీట్లో కూర్చుని పనిచేస్తుంటారు. అటువంటి వారి పొట్టలో మందం చేరి, జీర్ణశక్తి 0తగ్గిపోతుంది. వారు ప్రతి రోజు ఉదయాన్నే మంచి నీళ్లు తాగితే, ఆ నీళ్లు పొట్టను క్లీన్ చేయడమే కాకుండా జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి.

ఉదయం పూట వ్యాయామం చేసే అలవాటు ఉన్న వాళ్లు చాలా ఎనర్జీ కోల్పోతుం టారు. అటువంటి వాళ్లకు ఒక లీటర్ మంచి నీళ్లు శరీరానికి ప్రొటీన్స్ బాగా అందేలా చూస్తాయి.

# పరకడుపున లీటరు నీళ్లు తాగితే...?



కోల్పోయిన ఎనర్జీని తిరిగి తెస్తాయి. అంతకాదండోయ్ రక్తంలోని మలినాలను తరిమికొడ తాయి. వాతావరణ కాలుష్యం కారణంగా పలువురి చర్మ డల్‌గా తయారవుతుంది. అటువంటి వారు క్రమం తప్పకుండా రోజు లీటరు నీళ్లు తాగితే చర్మ మెరిసిపోతుంది. మితి మీరి బరువు పెరిగిన వాళ్లు ప్రతి రోజు పరకడుపున మంచి నీళ్ల తాగితే బరువు అతి సులభంగా తగ్గిపోతారు. ముఖ్యంగా ఇటీవల అత్యధిక సంఖ్యలో పురుషులు ఎదుర్కనే సమస్య కిడ్నీలో రాళ్ల.

ఈ సమస్యకు అసలైన మందు మంచి నీళ్లే అని వైద్యు లు తెలుపుతున్నారు. రోజూ లీటర్ మంచి నీళ్లు తాగితే కిడ్నీలో రాళ్లు చేతులు. ఇంత టి మేలు చేసే మంచి నీళ్లను తాగడం ఎవరూ మరువకండి.

# తలకు మసాజ్ వల్ల.. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు



**హెడ్ మసాజ్:** తలకు మసాజ్ చేసుకోవడం లేదా చేయించుకోవడం వల్ల నేచురల్ గా విశ్రాంతి పొంద వచ్చు. మానసికంగా మరియు శారీరకంగా విశ్రాంతి పొందవచ్చు. తలకు మసాజ్ చేయించుకోవడం వల్ల మనస్సు మరియు శరీరం చాలా తేలికపడుతుంది. ఎక్కువ పనిచేసేవారు, ఉద్యోగులు పనిఒత్తిడితో ఒత్తిడి ఎక్కువైనప్పుడు తప్పనిసరిగా వారంలో ఒకసారి తలకు మసాజ్ చేయించుకోవడం మంచిదని నిపు ణులు చెబుతున్నారు. తలకు మసాజ్ చేయించు కోవడం వల్ల ఒత్తిడి నుండి ఉపశమనం కలిగిస్తుంది, తలలో రక్తప్రసరణ మెరుగుపరుస్తుంది, బ్లడ్ ప్రెజర్ తగ్గిస్తుంది. ముఖ్యంగా జీవకణాలను మరియు నరా లను విశ్రాంతి పరుస్తుంది. =జ్యూ మీ=జు: పొట్ట ఉదర భాగంలో మసాజ్ చేయడం వల్ల పొందే ఆరోగ్య ప్రయోజనాలు తలకు మసాజ్ చేయించుకోవడానికి స్పా లేదా సలూన్స్ కు వెళ్ళడం మంచిది. ఇంట్లో కూడా చేసుకోవచ్చు. అలా చేసుకోవడానికి చాలా సింపుల్ అండ్ ఈజీ టిప్స్ ఉన్నాయి ... 4-5 టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడి చేయాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు, అందులో చేతి వేళ్ళు నూనెలో డిప్ చేసి తలకు పట్టించి మసాజ్ చేసుకోవాలి. లేదా గోరువెచ్చని నూనెలో కొద్దిగా కాటన్ బాల్ డిప్ చేసి తలకు మసాజ్ చేసుకోవాలి. బాడీ మసాజ్ వల్ల పొందే ఉత్తమ ఆరోగ్య ప్రయోజనాలు ఒత్తిడి లేదా తలలో ప్రెజర్ పాయింట్స్ వద్ద కొద్దిగా ప్రెస్ చేస్తూ సర్కులార్ మోషన్ లో మసాజ్ చేసుకోవడం మంచిది 5-10మసాజ్ చేసి, తర్వాత రెండు నిముషాలు విరామం తర్వాత తిరిగి తలకు మసాజ్ చేయాలి. తలకు మసాజ్ చేయడం వల్ల పొందే కొన్ని హెల్త్ బెనిఫిట్స్ ఈ క్రింది విధంగా...**మైగ్రేన్ తలనొప్పిని నివారిస్తుంది:** తలకు డీప్ గా హాట్ ఆయిల్ మసాజ్ చేసుకోవడం ల్ల మైగ్రేన్ సమస్యలను నివారిస్తుంది. రెండు వేళ్ళతో మసాజ్ చేయడం వల్ల తలనొప్పి తగ్గిస్తుంది. నూనె గోరువెచ్చగా ఉన్నప్పుడు ఉపయోగించాలని గుర్తుంచుకోవాలి.

**తలనొప్పి తగ్గిస్తుంది:** కొన్ని నేచురల్ రెమెడీస్ వల్లనే తలనొప్పిని తగ్గించుకోవచ్చు. అయితే తరచూ ఇబ్బంది పెట్టే తలనొప్పిని హెడ్ మాసాజ్ వల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. హెడ్ మసాజ్ కు కొన్ని ప్రత్యేకమైన నూనెలో ఉపయోగించడం ల్ల కూడా నొప్పి తగ్గించడంతో పాటు, మనస్సు ఉపశమనం కలిగిస్తుంది.

**వెన్నునొప్పి నివారిస్తుంది:** హెడ్ మాసాజ్ వల్ల మెడ మరియు బ్యాక్ మజిల్స్ రిలాక్స్ అవుతాయి. దాని వల్ల నొప్పి నివారించబడుతుంది. వెన్ను నొప్పి తగ్గించు కోవడానికి. సలూన్ కు వెళ్ళడం మంచిది.

**నిద్రలేమిని నివారిస్తుంది:** రెస్ట్ లెస్ నైట్స్, లేదా నిద్రలేమి సమస్యలకు హెడ్ మసాజ్ చెక్ పెడుతుంది. గోరువెచ్చని నూనెతో సున్నితమైన హెడ్ మసాజ్ చేసుకోవడం వల్ల మంచిగా నిద్రపట్టడానికి సహాయ పడుతుంది.

**బ్లడ్ సర్క్యులేషన్ పెంచుతుంది:** ఆయిల్స్ తోటి తలకు మసాజ్ చేయడం వల్ల రక్తప్రసరణ నరాలకు మెరుగ్గా ప్రవహిస్తుంది. దాంతో శరీరంలో కండరాలు రిలాక్స్ అవుతాయి. మరియు స్ట్రోక్ ను నివారించు కోవచ్చు. మనస్సు తేలికపడుతుంది.

**ఏకాగ్రత మెరుగుపడుతుంది:** పిల్లలు చదువులో ఏకాగ్రత లేనప్పుడు, వారికి సున్నితమైన ఆయిల్ హెడ్ మసాజ్ ఎందుకు ఇవ్వకూడదు. ఇది వారి మూడ్ ను మార్చుతుంది. చదువు మీద, ఆటల మీద ఏకాగ్రత పెరుగుతుంది.

**ఒత్తిడి తగ్గిస్తుంది:** తలకు గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. తలకు చేతి వేళ్ళు ఒత్తుకుంటూ మసాజ్ చేసుకోవడం వల్ల మైండ్ రిలాక్స్ అవుతుంది. ఇది హైటెన్సన్ తగ్గిస్తుంది.

**శరీరంను పునరుజ్జీవింపచేస్తుంది:** తలకు మసాజ్ చేసుకోవడం వల్ల మొత్తం శరీరం యొక్క ఆరోగ్యాన్ని మరియు మనస్సును విశ్రాంతి పరుస్తుంది.దాంతో శరీరంను పునరుజ్జీవింపచేయడానికి సహాయపడు తుంది.

# ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

**– ఇంటింటికి ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం – రేపటి నుండి ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభం.**

**– జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున**



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ప్రత్యేక అధికారి, కమీషనర్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు తో కలిసి కలక్టరేట్ సమావేశ మందిరంలో " జగనన్న ఆరోగ్య సురక్ష " కార్యక్రమంపై జిల్లా వైద్యాధికారులు, జీవిఎంసి జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవో లు తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు . వాలంటీర్లు, ఎఎన్ఎమ్ లు తమ పరిధిలోని గృహాలను సందర్శించి ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడంతో పాటు, ఇంట్లో ఉన్న వారి అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి కావలసిన వైద్య సదుపాయాల వివరాలు సేకరించి యాప్ లో అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ గ్రామానికి జగనన్న ఆరోగ్య సురక్ష టీం ఎపుడు వస్తారు అనే విషయాన్ని కూడా వారికి తెలియచేసి శిబిరానికి వారు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబరు 30 వరకు నెల రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో రెండు గ్రూప్ లుగా చేసుకొని తహసీల్దార్ మరియు ఎంపిడిఓ గ్రామములోని ప్రజలకు దగ్గరలో అనుకూలంగా ఉన్న ప్రదేశాన్ని నిర్ణయం చేసుకొని క్యాంప్ కు కావలసిన ఏర్పాట్లు చేయాలన్నారు. క్యాంపుల వద్ద మంచినీరు, ప్రతి క్యాంపుకు నలుగురు డాక్టర్లు ఉంటారని, అందులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారని, మరో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు ఉంటారన్నారు. సచివాలయ ఆరోగ్యకార్యకర్తలు, ఎమ్ఎల్హెచ్పిలు, ఆశా కార్యకర్తలు వాలంటీర్ల సహకారంతో ఇంటి ఇంటి సర్వే నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా అందించే వైద్య సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి క్యాంపు దగ్గర 108 అంబులెన్సులను తప్పక ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి వైద్యులు, సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది, డాక్టర్లు వారికి కేటాయించిన తేదీల్లో క్యాంపులో పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పటిష్ట నిర్వహణకు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి,కమీషనర్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పట్టణ ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉన్నందున వాలంటీర్లు, ఎఎన్ఎమ్ లు ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్లను ఆదేశించారు. అర్బన్ ప్రాంత మురికివాడల్లో నివసిస్తున్న ప్రజల పట్ల మరింత శ్రద్ధ వహించి వారికి వైద్య క్యాంపుల వివరాలు తెలియజేయాలన్నారు.

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి కమీషనర్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు, జివియంసి కమీషనర్ సి.యం సాయికాంత్ వర్మ, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, బాస్కర్ రెడ్డి, డియంహెచ్ఓ జగదీశ్వరరావు, వైద్య సిబ్బంది, జోనల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గీతంతో బొటానిక్ హెల్త్‌కేర్ ఎంఓయు

## ప్రకృతి సిద్ద ఔషధ పరిశోధనలకు సహకారం




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** ప్రకృతి సిద్ద ఔషధ పరిశోధనలలో పరస్పరం సహకారంతో అధ్యయనాలను నిర్వహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కర్ణాటక కేంద్రంగా గల బొటానిక్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కన్సల్టెన్సి మరియు కొలాబరేషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్‌తరన్‌దాస్ మరియు బొటానిక్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ గ్లోబల్ బిజినెస్ డవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎన్.శివప్రసాద్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కన్సల్టెన్సి మరియు కొలాబరేషన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ పరిశ్రమలతో మెరుగైన సంబంధాలకు గీతం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పరిశోధనల ద్వారా రానున్న సంవత్సరాలలో గీతం ప్రపంచ ఖ్యాతిని పొందాలన్న లక్ష్యంతో ప్రణాళికా యుతంగా కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. దీనికి గాను భారీవ్యయంతో విశాఖ, హైదరాబాద్, బెంగళూరులలో మూర్తి పేరిట అధునాతన ప్రయోగశాలలను నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. బొటానిక్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ గ్లోబల్ బిజినెస్ డవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎన్.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన ఔషధ ఉత్పత్తులలో తమకు 20 సంవత్సరాల అనుభవం ఉందని ప్రపంచంలోని అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, దక్షణకొరియా మరియు యూరప్ తదితర దేశాలలో తమకు శాఖలు ఉన్నాయని తెలిపారు. గీతంతో సంయుక్త పరిశోధనలను నిర్వహించడానికి తాము ఆసక్తితో ఉన్నామని పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్‌తరన్‌దాస్ మాట్లాడుతూ ఫార్మశీ పరిశోధనలలో తమ ఫ్యాకల్టీ సభ్యులు వివిధ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారని, బొటానికల్ హెల్త్‌కేర్ సంస్థ ద్వారా సంయుక్త అధ్యయనాలు జరుపుతామన్నారు. కార్యక్రమంలో గీతం కన్సల్టెన్సి మరియు కొలాబరేషన్స్ డిప్యూటీ డైరక్టర్ సోంభట్‌శాస్త్రి, గీతం స్కూల్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, డాక్టర్ సునీతా తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్ల పై ఆరా

## –జిల్లా ప్రత్యేకాధికారి, సిడిఎంఏ కోటేశ్వరరావు



విశాఖపట్నం సెప్టెంబర్ 29:– జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం నుండి ప్రారంభం కానున్నందున జివిఎంసి పరిధిలో ఏర్పాట్లు ఎంత వరకు పూర్తి అయ్యాయని జిల్లా ప్రత్యేకాధికారి, సిడిఎంఐ కోటేశ్వరరావు జివిఎంసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఆయన విశాఖ కలెక్టర్ ఆఫీస్ సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఇతర అధికారులతో జగనన్న సురక్ష వైద్య శిబిరాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో 72 క్యాంపులలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల కొరకు ఇంటింటి సర్వే పక్కాగా నూరు శాతం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష వైద్య శిబిరాల గూర్చి ప్రజలకు తెలియపరచి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ శిబిరం ద్వారా వైద్యం పొందాలని వారికి తెలియ పరచవలసినదిగా తెలిపారు. శనివారం నాడు మధురవాడ, గాజువాక, చేపలుప్పాడలలో ఆరోగ్య కేంద్రాలలో ఈ శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ముఖ్యంగా దంత, కళ్ళు, బాలింతలు, గర్భిణీలు, బీపీ, షుగరుతో పాటు ఎముకల విభాగపు వైద్యులు ఈ శిబిరంలో ఉంటారని తెలిపారు. ఈ క్యాంపులు అక్టోబర్ 30 వరకు నగర పరిధిలో 72 చోట్ల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు కనక మహాలక్ష్మి, విజయలక్ష్మి, శివప్రసాద్, ఆర్జీవి కృష్ణ, సింహాచలం, మల్లయ్య నాయుడు, డిపిఓ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో భారీ క్రికెట్ బెట్టింగ్ మోసం




## సుమారు రూ.368 కోట్లు నష్టపోయిన బాధితులు
## 36 అకౌంట్లు ఫ్రీజ్, 11 మంది అరెస్ట్

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖలో భారీ క్రికెట్ బెట్టింగ్ ముఠా వ్యవహారం బట్టబయలైంది. బాధితులు రూ.368 కోట్ల మేర నష్టపోయినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పోలీసులు 11 మందిని అరెస్టు చేసి, 36 అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. విశాఖ నగరానికి చెందిన ఎర్ర సత్తిబాబు తన మిత్రుడు సూరిబాబు మాటలు నమ్మి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.8 లక్షలు నష్టపోయానని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి శ్రీనివాసరావు శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన ఎర్ర సత్తిబాబు నుంచి అందిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. 63 బ్యాంక్ అకౌంట్ల ద్వారా రూ.367,62,97,000 లావాదేవీలు ఈ బెట్టింగ్‌ల నేపథ్యంలో జరిగినట్టు గుర్తించారు. ఈ క్రమంలో కీలక నిందితుడైన అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి చెందిన రెడ్డి సూరిబాబుతోపాటు మరో పది మందిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. 14 ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఐపిఎల్ మ్యాచ్‌ల సమయంలో సూరిబాబు 20 నుంచి 30 మంది వ్యక్తుల నుంచి అమౌంట్ కలెక్ట్ చేసేవాడు. సంవత్సరానికి రూ.5 కోట్లు నుంచి రూ.6 కోట్లు బిజినెస్ టర్నోవర్ జరిగేలా చూసేవాడు. సేకరించిన మొత్తాన్ని సూర్యాబాగ్‌కు చెందిన టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకుడు దినేష్ కుమార్‌కు పంపేవాడు. అందుకుగాను సూరిబాబుకు రెండు శాతం కమీషన్ దక్కేది. ఈ విధంగా తనకు తెలిసిన వ్యక్తులను బుకీలుగా మార్చి కమీషన్ కోసం బెట్టింగ్ నిర్వహించేలా ఆయన ప్రేరేపించేవాడు. సర్వర్‌లోని లోపాలను గుర్తించి డబ్బులు పెట్టిన వారికి నష్టం వచ్చేలా, ఓడిపోయే జట్లపై ఎక్కువ మొత్తంలో బెట్టింగ్ వేసేలా బుకీలు పథకాలు రచించేవారు. ఈ విషయం తెలియక ప్రజలు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి నష్టపోయేవారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు గెలుచుకున్నా, యాప్‌లలోని వారి ఖాతాను బ్లాక్ చేసి నకిలీ పత్రాలతో ఓపెన్ చేసి సేవింగ్స్ అకౌంట్‌కు ఆ నగదును జమ చేసి అక్కడి నుంచి కొన్ని కార్పొరేట్ అకౌంట్లకు బదిలీ చేసేవారు. ఈ బెట్టింగ్ రాకెట్ వ్యవహారం బట్టబయలైన తరువాత ప్రధాన నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఇప్పటివరకూ అరెస్టయిన వారిలో రెడ్డి సూరిబాబు, బర్రి శీను, గుర్రం శివ, కిలాడి శ్రీనివాసరావు, అల్లు నూకరాజు, వురిటి కొండబాబు, పురిటి వెంకటేశ్వర్లు, సుందరపు గణేష్, ధూళి నూకరాజు, హండ దినేష్ కుమార్, వుప్పు వాసుదేవరావు ఉన్నారు. వీరంతా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారు.

# హైవే లో కీప్ లెఫ్ట్ సూచికలు ఏర్పాటు




కంచరపాలెం (విజయభాను న్యూస్) : కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల నేషనల్ హైవే 16 మరియు బి.ఆర్.టి.ఎస్ రోడ్లపై విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ డాక్టర్ రవిశంకర్ ఐ.పీ.ఎస్ ఆదేశాల మేరకు వాహనదారులను చైతన్య పరి చేందుకు మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు గాను రోడ్డు పై కీప్ లెఫ్ట్ లెటర్స్ మరియు యారో మార్క్స్ పెయింటింగ్స్ ను తాటిచెట్లపాలెంలో గల నేషనల్ హైవే జంక్షన్ లో ట్రాఫిక్ ఏడీసీపీ జి శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ జి. రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ విభాగం లో యున్న పెయింటర్తో పెయింటింగ్ లు వేయించడం జరిగింది. చిన్నవాహనాలు ఎడం వైపు ప్రయాణించే విధంగా భారీ వాహనాలు కుడివైపు ప్రయాణించే విధంగా సూచించుటకు గాను పెయింటింగ్ లు వేయించడం అయినది. నేషనల్ హైవే లోను అందరూ లేన్ డిసిప్లేన్ పాటించి ఎటువంటి ప్రమాదాలుకు గురికాకుండా ఉండాలని జోన్ 2ట్రాఫిక్ ఏసీపీ జి. రాజీవ్ కుమార్ సూచించారు. కియా కారుల షో రూం సీఈవో శ్రీనివాసరావు మరియు మేనేజర్ నరేష్ లు సౌజన్యంతో పెయింటింగ్స్ సమకూర్చారు. ఇలాంటి పెయింటింగ్అన్ని ముఖ్య జంక్షన్స్ లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. కంచరపాలెం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మళ్ల అప్పా రావు, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు లు పాల్గొన్నారు.

# రేపటి పర్యావరణానికి నేటి విత్తనబంతులు

## – నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** పర్యావరణ పరిరక్షణకు పచ్చని చెట్లు అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయ ఆవరణలో దేశీయ అడవి విత్తనాలను ఉపయోగించి మట్టి, పేడ కలిపిన విత్తన బంతులను స్వయంగా తయారు చేసి జివిఎంసి ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. విశాఖ నగరంలో ఉన్న కొండలపై సుమారు రెండు లక్షల విత్తనబంతులను అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున నేవల్ అధికారుల సహకారంతో హెలికాప్టర్లో జారవిడవడం జరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కొరకు చెత్తాచెదారం లేని స్వచ్ఛమైన విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు జివిఎంసి నిరంతరం కృషి చేస్తుందని ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో విశాఖను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నగర పౌరులు స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, ఎన్జీవోస్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ఈ విత్తన బంతుల ద్వారా పశుపక్షాదిలే కాక సమస్త జీవరాసులకు ఆహారం వసతి ఆరోగ్యం ఏర్పడుతుందని, అనేక ఔషధ గుణాలు ఉన్న 30 రకాల జాతులకు చెందిన విత్తనాలతో తయారు చేసిన విత్తన బంతులను తయారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, కార్యదర్శి నల్లనయ్య, డి.సి.ఆర్. ఫణిరామ్, జివిఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com